# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :38 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 29-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## గోవా నుంచి పోలింగ్ స్టేషన్ కు...

మహబూబ్ నగర్,మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ బైపోల్ మాజీ సీఎం కేసీఆర్‌ను టెన్షన్ పెడుతోంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆయన పడరాని పాట్లు పడుతున్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో గోవాలో క్యాంప్ ఏర్పాటు చేశారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గోవా వెళ్లారు. గోవాలో మహబూబ్‌నగర్ జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం కేటీఆర్ నేతృత్వంలో క్యాంప్ పెట్టడంపై రాజకీయంగా వాడివేడి చర్చ జరుగుతోంది.ఈ నెల 28న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరగబోతోంది. బైపోల్ కోసం గోవాలో క్యాంప్ పెట్టడంపై పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటమి భయంతోనే గోవాలో క్యాంప్ పెట్టారంటుని గులాబీ నేతలే అంటున్నారు. ఎమ్మెల్సీ బైపోల్‌లో ఓడిపోతే పరువు పోతుందని, ఆ ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపైనా పడుతుందని కేసీఆర్, కేటీఆర్ ఆందోళనలో ఉన్నారు.ఇదే జరిగితే తెలంగాణలో కారు పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో ఫ్యామిలీ వార్..



హైదరాబాద్, ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములకే వాడి ఎక్కువన్నట్లు తెలంగాణ రాజకీయాలు మారిపోయాయి. గెలుపు గుర్రాల పేరుతో తెలంగాణ కాంగ్రెస్ వలస నేతలకే పెద్ద పీట వేస్తోంది. బాగా ఆర్థికంగా డబ్బున్న వ్యక్తులను ఇతర పార్టీల నుంచి తీసుకొచ్చి మరీ టికెట్లు కేటాయిస్తోంది. మరోవైపు ఫ్యామిలీ మెంబర్స్ కూడా పార్లమెంట్ టికెట్ రేసులో ఉంటున్నారు. దీంతో కాంగ్రెస్‌లో ముసలం రాజుకుంటోంది. దీనిపై నేరుగా సీఎం ముందే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ టికెట్లు కూడా ఫ్యామిలీ మెంబర్స్ కే దక్కుతున్నాయని అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఇంతకీ తెలంగాణ కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..? పెండింగ్ సీట్లపై అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది..?

ఇజ్జత్ కా సవాల్

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలను ఇజ్జత్ కా సవాల్ గా తీసుకుంది. మొత్తం 17 పార్లమెంట్ స్థానాల్లో 14 గెలిచి తీరాలని టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. తమ వందరోజుల పరిపాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం అంటూ పదేపదే చాలెంజ్ చేస్తున్నారు. అయితే ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల విషయంలో.. రేసుగుర్రాలంటూ కొత్త సాంప్రదాయానికి తెర దీశారు. ఆర్థికంగా బలమైన నేతలని ఇతర పార్టీల నుంచి తీసుకొచ్చి మరీ టికెట్లు కేటాయిస్తున్నారు. ఈ విషయంలో పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నిన్నటి వరకు పార్టీని తిట్టిన వారిని.. కార్యకర్తలపై కేసులు పెట్టిన వారిని తీసుకొచ్చి టికెట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ఇతర పార్టీల నుంచి వచ్చిన పలువురు నేతలకు కాంగ్రెస్ టికెట్లిచ్చింది. చేవెళ్ల తరపున రంజిత్ రెడ్డి, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, మల్కాజ్గిరి నుంచి సునీతా మహేందర్ రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీలకు టికెట్ లు కేటాయించారు. ఈ విషయంలో చాలా మంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ నేత వి.హనుమంతరావు పార్టీ వేదిక మీద ప్రెస్ మీట్ పెట్టి మరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి ఇతర పార్టీ నేతల ఇళ్లకు వెళ్లడం సరైన సాంప్రదాయం కాదంటూ విమర్శలు గుప్పించారు.

గేట్లు తెరిస్తే దొంగలే వస్తున్నారు

ఇక వలస నేతలకు టికెట్లు ఇవ్వడం విషయంలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ముందే సీనియర్ నేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గేట్లు తెరిస్తే అందరూ దొంగలు వస్తున్నారు అంటూ చురకలంటిచారు. చేవెళ్ల పార్లమెంట్ సమీక్షా సమావేశం సందర్భంగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ముందే హాట్ కామెంట్స్ చేశారు. పార్టీలోకి దొంగలు వచ్చి పెత్తనం చేయడం.. కాంగ్రెస్ కార్యకర్తలకు అవమానకరంగా మారింది అంటూ కామెంట్స్ చేశారు. పార్లమెంట్ సమీక్షా సమావేశంలో నేతలు అందరి ముందు.. కేఎల్ఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.ఒక వైపు వలసనేతల అంశం తీవ్ర దుమారం రేపుతుండగా.. మరో వైపు కుటుంబంలోని వారికే టికెట్లు ఇవ్వడమనే అంశం కూడా రచ్చరచ్చగా మారుతోంది. ఇప్పటికే నల్లగొండ పార్లమెంట్ సీటు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్ రెడ్డికి, పెద్దపల్లి సీటు గడ్డం వివేక్ కుమారుడు వంశీకి కేటాయించారు. ఇందులో గడ్డం వంశీకి సీటు కేటాయింపుపై తీవ్ర దుమారం రేగుతుంది. ఇప్పటికే బెల్లంపల్లి, చెన్నూరు రెండు అసెంబ్లీ సీట్లు గడ్డం వినోద్, గడ్డం వివేక్ ఇద్దరు అన్నదమ్ములకు కేటాయించారు. ఇప్పుడు తాజాగా పెద్దపల్లి పార్లమెంట్ సీటును వివేక్ కుమారుడు వంశీకి కేటాయించడంపై నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హాట్ టాపిక్‌గా ఖమ్మం సీటు

ఇవే కాకుండా పెండింగ్ లో ఉన్న మిగతా సీట్లలో కూడా ముఖ్య నేతల ఫ్యామిలీ మెంబర్స్ బరిలో దిగాలని చూస్తున్నారు. భువనగిరి నుంచి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మికి టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇక ఖమ్మం సీటు అయితే హాట్ టాపిక్‌గా మారింది. ఈ సీటు కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన భార్య నందినికి కావాలని అడుగుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సోదరుడు ప్రసాద్ రెడ్డికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్ కు కావాలని కోరుతున్నారు. ఇలా మొత్తం మీద ఫ్యామిలీ మెంబర్స్ టికెట్ల అంశం కాంగ్రెస్ లో హాట్ టాపిక్ గా మారింది.

# సుప్రీంకోర్టు సీజేఐకి 500 మంది న్యాయవాదుల సంచలన లేఖ..!

న్యూఢిల్లీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుమారు 500 మందికిపైగా న్యాయవాదులు లేఖ రాశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ లేఖ రాశారు. న్యాయస్థానాల కోసం నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన వారిలో ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, ఆదిష్ అగర్వాల్, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేష్ జైన్, ఉజ్వల వార్, ఉదయ్ హొల్లా, స్వరూపమా చతుర్వేది, సహా దేశవ్యాప్తంగా 500 మందికిపైగా న్యాయవాదులు లేఖ రాశారు. న్యాయవ్యవస్థ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని లేఖలో ఈ లాయర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని 'ప్రత్యేక బృందాలు' న్యాయ ప్రక్రియను ప్రభావితం చేయడానికి.. కోర్టు నిర్ణయాలను ప్రభావితం చేయడానికి 'కొన్ని ప్రత్యేక బృందాలు' ప్రయత్నిస్తున్నాయని న్యాయవాదులు ఆరోపించారు.రాజకీయ ఉద్దేశాలతో ఈ వర్గాలు నిరాధార ఆరోపణలు చేస్తూ న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని లేఖలో ఆరోపించారు. న్యాయవ్యవస్థపై తప్పుడు కథనాలను ప్రచారం చేయడంతో పాటు, ప్రస్తుత విచారణలను కించపరచడం.. న్యాయస్థానాలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని న్యాయవాదులు లేఖలో ప్రస్తావించారు. న్యాయవ్యవస్థను ప్రభావితం చేయడానికి,



న్యాయస్థానాలను అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను కాపాడేందుకు ఈ దాడులకు వ్యతిరేకంగా రక్షణ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను కోరారు. సవాళ్లను పరిష్కరించడంలో నిర్ణయాత్మక నాయకత్వాన్ని కోరుతూ.. ప్రజాస్వామ్యానికి బలమైన స్తంభంగా ఉండేలా న్యాయవ్యవస్థకు మద్దతుగా ఐక్యంగా నిలబడాలని లేఖలో న్యాయవాదు కోరారు.

# కాంగ్రెస్‌కు మరో షాక్..! పార్టీకి మాజీ మంత్రి సావిత్రి జిందాల్ రాజీనామా



న్యూఢిల్లీ,లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఓపీ జిందాల్ గ్రూప్ చైర్‌పర్సన్, హర్యానా మాజీ మంత్రి సావిత్రి జిందాల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. జిందాల్ తన కుటుంబ సభ్యుల సలహా మేరకు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. తాను పది సంవత్సరాలుగా హిసార్ ఎమ్మెల్యేగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించానని.. రాష్ట్రానికి నిస్వార్థంగా సేవ చేశానన్నారు. కుటుంబ సభ్యుల సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానన్నారు. తనకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకత్వానికి, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో చేరిన తనయుడు

ఇదిలా ఉండగా.. సావిత్రీ జిందాల్ కుమారుడు, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ చైర్మన్ నవీన్ జిందాల్ ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. నవీన్ జిందాల్ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా కురుక్షేత్ర లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. సావిత్రి జిందాల్ పది సంవత్సరాల పాటు హిసార్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పని చేశారు. హర్యానా ప్రభుత్వంలో మంత్రిగానూ సేవలందించారు. 2005లో జిందాల్ గ్రూప్ వ్యవస్థాపకుడు ఓపీ జిందాల్ విమాన ప్రమాదంలో మరణించిన అనంతరం హిసార్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

రాజకీయ జీవితం..

2005 జిందాల్ హిసార్ నియోజకవర్గం నుంచి హర్యానా విధానసభకు ఎన్నికయ్యారు. అంతకు ముందు ఆమె భర్త ఓం ప్రకాశ్ జిందాల్ చాలాకాలం పాటు హిసార్‌కు ప్రాతినిధ్యం వహించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. 29 అక్టోబర్ 2013న హర్యానా ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా నియామకమయ్యారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ, విపత్తు నిర్వహణ, గృహనిర్మాణం శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హర్యానా శాసనసభ సభ్యురాలిగా చేశారు. 2010 వరకు విద్యుత్ శాఖ మంత్రిగా కొనసాగారు. 2014 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హిసార్ నుంచి ఓడిపోయారు.

సంపన్న మహిళ..

భారతదేశంలోని అత్యంత సంపన్న మహిళల జాబితాలో సావిత్రి జిందాల్ పేరు అగ్రస్థానలో ఉంది. ఆమె వయస్సు 84 సంవత్సరాలు. జిందాల్ గ్రూప్ భారీ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. మార్చి 28, 2024 నాటికి, సావిత్రి జిందాల్ నికర విలువ 29.6 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో దాదాపు రూ.2.47 లక్షల కోట్లు. ప్రపంచ బిలియనీర్ల జాబితాలో సావిత్రి జిందాల్ 56వ స్థానంలో ఉన్నారు.

# తమిళనాడులో విషాదం.. టికెట్ రాలేదని ఎంపీ ఆత్మహత్య


తమిళనాడు:తనకు ఈసారి ఎంపీ టికెట్ కేటాయించలేదని మనస్తాపం చెందిన ఈరోడ్ ఎంపీ, ఎండీఎంకే నేత గణేశమూర్తి (77) ఆత్మహత్యాయత్నం చేసి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం కన్నుమూశారు. మరికొద్దిరోజుల్లో లోక్ సభ ఎన్నికలు జరగనుండగా.. ఈ విషాదకర ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. గణేశమూర్తికి 2019 లోక్ సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో స్థానం దక్కింది. ఈరోడ్ పార్లమెంట్ స్థానం నుంచి ఆయన డీఎంకే గుర్తుపైనే పోటీ చేసి గెలిచారు.అయితే తాజా లోక్ సభ ఎన్నికల్లో.. కూటమి సీట్ల సర్దుబాటులో టికెట్ ను ఎండీఎంకేకుతిరుచ్చి టికెట్ ఇచ్చింది. అక్కడి నుంచి దురైవైగోను అభ్యర్థిగా ప్రకటించింది. తనకు టికెట్ కేటాయించకపోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నానని గణేశమూర్తి మీడియాకు తెలిపారు. గణేశమూర్తిని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయించాలని భావిస్తున్నామని, దురైవైగోకు ఎంపీ టికెట్ ఇవ్వడం ఆయనకు నచ్చకపోతే తనకు నచ్చింది చేసుకోవచ్చని ఎండీఎంకే అధిష్ఠానం తెలిపింది.దాంతో గుర్తుమూర్తి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మార్చి 24న విషపూరితమైన ట్యాబ్లెట్లను మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే ఆయన్ను కోయంబత్తూర్ లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. నాలుగు రోజులుగా అక్కడే చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో.. 5.05 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యగా కేసు నమోదు



చేసిన పోలీసులు.. గణేశమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెరుందురైలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ ప్రక్రియ పూర్తికాగానే భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.కాగా.. ఎంపి గణేశమూర్తి 1947 జూన్ లో జన్మించారు. 1993లో ఎండీఎంకే పార్టీ ప్రారంభమవ్వగా.. నాటి నుంచీ ఆ పార్టీలోనే ఉన్నారాయన. 1998లో తొలిసారి పళని పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. 2009, 2019 లోక్ సభ ఎన్నికల్లో ఈరోడ్ నుంచి పోటీ చేసి గెలిచారు.

# మళ్లీ బాజిరెడ్డి,ధర్మపురి కుటుంబాల మధ్యే

నిజామాబాద్, మార్చి 27:ఉత్తర తెలంగాణలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం హాట్ సీట్ మారిపోయింది. ఇక్కడ బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పోటీ చేస్తుంటే... బీఆర్ఎస్ పార్టీ తరపున ఆ పార్టీ సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ బరిలోకి దిగుతున్నారు. ధర్మపురి అర్వింద్, బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబాల మధ్య దశాబ్దాలుగా రాజకీయ వైరం ఉంది. దీంతో ఈ ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో నిరూపించుకోవడానికి సమాయత్తం అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ రాజకీయ ఉద్దండుగులు ఓ వెలుగు వెలిగారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో డి.శ్రీనివాస్‌తో బాజిరెడ్డి గోవర్ధన్ తలపడ్డారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డీఎస్ పై బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్...26 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో...డిఎస్ తనయుడు ఎంపీ అర్వింద్‌తో పోటీకి సై అంటున్నారు బాజిరెడ్డి గోవర్ధన్. బాజిరెడ్డి రాజకీయాల్లో తలపండిన నేతగా గుర్తింపు పొందారు. తనకంటే జూనియర్‌గా ఉన్న అర్వింద్ బరిలోకి దిగడంతో...రాష్ట్ర రాజకీయ నేతలంతా నిజామాబాద్ వైపు చూసేలా చేస్తున్నాయి. ఇద్దరూ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారే. బీజేపీలో కీలక నేతగా ఉన్న అర్వింద్.. రాజకీయాల్లో బాజిరెడ్డితో పోలిస్తే జూనియరే.. ఈ ఎన్నికల్లో జూనియర్ కు అవకాశం ఇస్తారా.. సీనియర్ కు పట్టం కడతారా ? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇద్దరు మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో...ఆ సామాజిక వర్గం ఓట్లను చీల్చడానికే బాజిరెడ్డిని బీఆర్ఎస్ బరిలోకి దించిందన్న ప్రచారం జరుగుతోంది. మాజీ పీసీసీ చీఫ్ డి.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబాల మధ్య ఏళ్లుగా రాజకీయ వైరం ఉంది. ఇద్దరు కాంగ్రెస్‌లో పని చేసినప్పటికీ...ప్రత్యర్థులుగా జిల్లాలో, రాష్ట్రంలో రాజకీయాలు నడిపారు. పీసీసీ అధ్యక్షుడి తనను తనను రాజకీయంగా అణగదొక్కేందుకు ధర్మపురి శ్రీనివాస్ కుట్రలు చేశారని బాజిరెడ్డి గోవర్ధన్ పలువురి వద్ద చెప్పుకున్నారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో డీఎస్‌తో పొసగక.. పార్టీ మారి ఆయనపైనే పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో ఓడించి...డీఎస్ పై పైచేయి సాధించారు.సీన్ కట్ చేస్తే ఇప్పుడు డీఎస్ చిన్న కుమారుడు బాజిరెడ్డి పోటీకి దిగారు. ధర్మపురి శ్రీనివాస్ ను ఓడించిన బాజిరెడ్డి గోవర్ధన్...కుమారుడు ఎంపీ అర్వింద్ ను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో వ్యూహాలు రచిస్తున్నారు. అప్పట్లోనే డీఎస్‌ను లైట్ తీసుకున్న బాజిరెడ్డి...ఆయన



కుమారున్ని ఓడించడమే తన ధ్యేయమని ప్రచారం చేస్తున్నారు. ఆర్మూర్, బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బాజిరెడ్డి...2023 అసెంబ్లీ మొన్నటి ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఐతే ఇప్పుడు ఎంపీగా బరిలో నిలిచి డీఎస్ ఫ్యామిలీని మరో సారి ఢీ కొట్టబోతున్నారు. 2014 ఎన్నికల్లో డీ శ్రీనివాస్ ను ఓడించిన బాజిరెడ్డి...2024 ఎన్నికల్లో అర్వింద్ ను కూడా ఓడిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి పోటీ టీడీపీ అభ్యర్థిపై గెలుపొందారు. 2004 బాన్సువాడ నియోజకవర్గంలో విజయం సాధించి...రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2014, 2018 ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి...బీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించారు. ఆర్టీసీ ఛైర్మన్ గానూ పని చేశారు.

# వరుణ్ గాంధీకి టికెట్ నిరాకరణ : ఫిలిబిత్ ప్రజలకుఎంపీ లేఖ



ఫిలిబిత్ : ఫిలిబిత్ ఎంపీ వరుణ్ గాంధీకి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ నిరాకరించింది. ఫిలిబిత్ ప్రజలను ఉద్దేశించి వరుణ్ గాంధీ లేఖ రాశారు. ఫిలిబిత్‌తో తన సంబంధం రాజకీయాలకు అతీతమైందని, ఫిలిబిత్ బిడ్డనైన తాను ప్రజల కోసం ఎంతటి మూల్యాన్ని చెల్లించేందుకూ సిద్ధమని ప్రకటించారు.సామాన్యుడి గొంతు వినిపించేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజల కోసం తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచేఉంటాయని స్పష్టం చేశారు. ఇవాళ తాను ప్రజల కోసం చేసే పనులను కొనసాగించేందుకు వారి ఆశీస్సులు కోరుతున్నానని అన్నారు. 1983లో మూడేండ్ల వయసులో తాను తల్లి వేలు పట్టుకుని ఫిలిబిత్ గడ్డపై అడుగుపెట్టానని, ఇప్పుడు ఇదే తన కార్యస్థలమైందని, ఇక్కడి ప్రజలు తన కుటుంబంలో భాగమయ్యారని, ఈ విషయాలన్నీ తనకు గుర్తుకువస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు.మీ ప్రతినిధిగా లోక్‌సభ కు ప్రాతినిధ్యం వహించడం తన జీవితంలో పొందిన అత్యున్నత గౌరవమని అన్నారు. ఎంపీగా తన పదవీ కాలం ముగియనున్నా, ఫిలిబిత్ ప్రజలతో తన అనుబంధం తుదిశ్వాస వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎంపీగా కాకున్నా ఈ ప్రాంత ప్రజల కోసం తాను జీవితాంతం పనిచేస్తూనే ఉంటానని, మీ కోసం తన ఇంటి తలుపులు గతంలో మాదిరిగా ఎప్పుడూ తెరిచేఉంటాయని అన్నారు. కాగా, ఐదో జాబితాలో బీజేపీ ఫిలిబిత్ నుంచి జితిన్ ప్రసాదకు టికెట్ కేటాయిస్తూ వరుణ్ గాంధీని పక్కనపెట్టింది. మరవైపు వరుణ్ గాంధీని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నామని ఆ పార్టీ నేత అహిర్ రంజన్ చౌధరి సిట్టింగ్ ఎంపీని స్వాగతించారు.

## జనగామ ఏసీపీ దామోదర్ రెడ్డి పై బదిలీ వేటు

జనగామ : జనగామ ఏసీపీ దామోదర్ రెడ్డి పై బదిలీ వేటు పడింది. ఎన్నికల కోడ్‌నిబంధనలు ఉల్లంఘించిన కేసులో ఏసీపీ దామోదర్ రెడ్డిని బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23న పెంబర్తి బైపాస్ రోడ్డు సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డితో కలిసి ఏసీపీ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. దీనిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వేటు పడింది.

## సంపాదకీయం

శుక్రవారం 29-03-2024

# మతోన్మాద శక్తులను కట్టడి చేయాలి!

ఇటీవల కాలంలో మతపరమైన అసహన సంస్కృతి పెరుగుతున్నది. దీనికి అనుగుణంగా సోషల్ మీడియానీ, ఇతర సాధనాలనూ ఒక ప్రణాళిక ప్రకారం కొన్ని మతోన్మాద శక్తులు దుర్వినియోగం చేస్తున్నాయి. స్త్రీల పట్ల అశ్లీలమైన, అసభ్యకరమైన భాషను వాడుతున్నాయి. మరీ ముఖ్యంగా ప్రగతిశీల మహిళా మేధావులు, రచయిత్రులు, జర్నలిస్టులు, యాక్టివిస్టులు, కళాకారులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా దాడులకు తెగబడుతున్నాయి. అక్కడితో ఆగకుండా ఫోన్లలో బెదిరింపులకు కూడా దిగుతున్నాయి. ఈ శక్తులు ఉపయోగించే పద్ధతులు, వాడే భాష వాటి నేపథ్యాన్ని, మేథాస్థాయిని, నేర ప్రవృత్తిని వెల్లడిస్తున్నాయి. తమ ఆలోచనలతో ఏకీభవించకుండా, భిన్నమైన ఆలోచనలు కలిగినవారి నోళ్లు మూయించే అనాగరిక, అమానుష చర్యలకు మతోన్మాద శక్తులు పాల్పడుతున్నాయి. సహజంగానే ఈ రకమైన దాడి ప్రధానంగా స్త్రీల మీదనే ఎక్కువగా జరుగుతున్నది. వీరి దృష్టిలో స్త్రీలు వంటింటి కుందేళ్లుగానే జీవించాలి. స్త్రీలు దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్త పరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయవాద సమర్ధక ముఠాలకు నచ్చదు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాష ధారణలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా కాల్ చేసి, తలుచుకుంటే వారి ఇళ్లపై దాడులు చేయగలమని, ప్రాణ హాని తలపెట్టగలమని బెదిరింపులకు పూనుకుంటున్నారు. చర్చ కు, భిన్నాభిప్రాయాలకూ తావులేకుండా చేసి, తమ విషపూరిత ద్వేష భావాలను విస్తృతంగా ప్రచారం చెయ్యడమే వీరి ఆశయం. ఈ అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక ధోరణులను మేము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ఈ దేశ పౌరులందరికీ వాక్స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఫలానా విధంగా అభిప్రాయాలు వ్యక్త పరచకూడదని, ఫలానా విధంగానే బతకాలని శాసించడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ప్రాధమిక హక్కు ని ప్రభుత్వంతో బాటు ఎవరూ హరించడానికి వీలు లేదు. ఈవిధంగా బెదిరింపులకు, దాడులకు పాల్పడే శక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, అలాంటి శక్తుల దూకుడుని కట్టడి చేయాల్సిందిగా ప్రభుత్వ వర్గాలను, పోలీసు వ్యవస్థను కోరుతున్నాం. ప్రజాస్వామిక సంస్థలు, వేదికలు :ప్రొ. జి. లక్ష్మణ్(పౌరహక్కుల సంఘం, తెలంగాణ), ఎస్. జీవన్ కుమార్ (మానవ హక్కుల వేదిక, తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాలు), అరసవిల్లి కృష్ణ , రివేరా (విప్లవ రచయితలసంఘం), శ్రీదేవి (చైతన్య మహిళా సంఘం), విజయ భండారు (హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్), పసునూరి రవీందర్, కన్వీనర్ (సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్), కె. శ్రీనివాసాచారి (హైదరాబాద్ హ్యూమనిస్ట్ మీట్), రేణుకా అయోల, తూముచర్ల రాజారాం (సంతకం సాహిత్య వేదిక), ఐకా బాలాజీ(మ0చి సినిమా గ్రూపు), బి. గిరిజ (వాయిస్ ఫర్ జెండర్ జస్టిస్), కొండవీటి సత్యవతి (భూమిక), అమరేంద్ర దాసరి (సాహితీవేదిక ఢిల్లీ), డా. బైరి నరేష్, జాతీయ అధ్యక్షుడు (మూఢనమ్మకాల నిర్మూలన సంఘం), మహిళా మరియు ట్రాన్స్‌జండర్ సంస్థల ఐక్య కార్యాచరణ వేదిక, ఖలీదా పర్వీన్, ఉష ( సన్నిహిత), వి.సంధ్య (పీవోడబ్ల్యూ), సజయ, సుమిత్ర (అంకురం), వంగపల్లి పద్మ (వాయిస్ ఆఫ్ ద పీపుల్), కన్నెగంటి రవి(రైతు స్వరాజ్యవేదిక), గీతాంజలి(వెన్నెల సాహిత్య సామాజిక అధ్యయన వేదిక)కవులు, రచయితలు, కార్యకర్తలు, విలేకరులు, న్యాయ వాద నిపుణులు:అఫ్సర్, నారాయణ స్వామి, డా. సి. మృణాళిని, గోగు శ్యామల, విమల, ప్రసాదమూర్తి, అరణ్య కృష్ణ , వెంకటకృష్ణ, దొంత0 చరణ్, నరేష్ సూఫీ,అరుణాంక్ లత, ఓల్గా, అక్కినేని కుటుంబరావు, పి .సత్యవతి, కొండేపూడి నిర్మల, ప్రతిమ, ఉదయమిత్ర, ఎ.కె ప్రభాకర్, నల్లూరి రుక్మిణి, తేళ్ళ అరుణ, అపర్ణ తోట, శివ లక్ష్మి, లక్ష్మీ సుహాసిని, కత్తి పద్మ, సీతా కంభంపాటి, శా0తి ప్రబోధ, అమరవాది నీరజ, గుత్తా జ్యోత్స్న, చల్లా సరోజినీ దేవి, బెల్లపు అనురాధ, చలం జీ.ఎస్, దుర్గా డి0గరి, ఘ0టసాల నిర్మల, పైడిమర్రి గిరిజ, జయలక్ష్మి, సమ్మెట ఉమాదేవి, మ0జుల, రోహిణి వంజారి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, నాంపల్లి సుజాత, మెర్సీ మార్గరెట్, కాత్యాయిని కె, సంధ్య కె, వివి జ్యోతి, గోపరాజు సుధ, రూపారుక్మిణి, సురేఖ, శీలా సుభద్రాదేవి, శిలాలోలిత, ఆశాలత, అంబిక, రత్నా సుమతి, రుక్మిణీ రావు, మీరా సంఘమిత్ర, రచన, వైజయంతి, ఇందిర, జహాఆరా, కల్పనా కన్నాబిరన్, హేమలలిత,సావిత్రి కోల,కన్నెగంటి అనసూయ కృష్ణకుమారి, ఝాన్సీ,అనసూయ, సుజాత,సరోజినీదేవి,శాంతిశ్రీ బెనర్జీ, రోహిణి,డా. కె.బి సంధ్యా విప్లవ్, వాసరచెట్ల జయంతి, జ్వలిత, డా.నళిని, అరుణ, డి. భారతి, కె. ప్రవీణ్, వైష్ణవిశ్రీ, సుభాషిణి తోట, సి.హెచ్ ఉషారాణి, శోభాభట్, రోజారాణి దాసరి తదితరులు.

# దేశంలో పెచ్చరిల్లుతున్న అన్‌ఎంప్లాయ్‌మెంట్.. నిరుద్యోగుల్లో 83% యువతే!



న్యూఢిల్లీ,దేశంలో నిరుద్యోగం పెచ్చరిల్లుతున్నది. నిరుద్యోగుల్లో దాదాపు 83 శాతం మంది యువతేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదిక పేర్కొన్నది. ఐఎల్‌వో, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్(ఐహెచ్‌డీ) సంయుక్తంగా 'భారత ఉపాధి నివేదిక-2024'ను ప్రచురించాయి. మొత్తం నిరుద్యోగ యువతలో కనీసం సెకండరీ విద్య చదువుకొన్న వారి సంఖ్య పెరుగుతుండటంపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. 2000లో 35.2 శాతం ఉన్న వీరి సంఖ్య 2022 నాటికి రెట్టింపై 65.7 శాతానికి చేరుకొన్నదని వెల్లడించింది. కరోనా సంక్షోభం సమయంలో ఉపాధి భారీగా పడిపోయిందని, ఈ కాలంలో చదువుకొన్న యువత అధిక నిరుద్యోగితను ఎదుర్కొన్నారని అధ్యయనం పేర్కొన్నది. 2000-2018 మధ్య శ్రామిక భాగస్వామ్య రేట్(ఎల్ఎఫ్‌పీఆర్), శ్రామిక జనాభా నిష్పత్తి(డబ్ల్యూపీఆర్) క్రమంగా తగ్గాయని, 2019 తర్వాత కొంత మెరుగైందని నివేదిక తెలిపింది.

### వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు

మరోవైపు రెగ్యులర్ కార్మికుల వేతనాలు, స్వయం ఉపాధి పొందే వారి ఆదాయం విషయంలో 2019 తర్వాత కొంత స్తబ్ధత నెలకొనడంతోపాటు క్షీణించాయని నివేదిక తెలిపింది. 2022లో అయితే నైపుణ్యం లేని సాధారణ కార్మికుల్లోని చాలా మంది కనీస వేతనాలను కూడా అందుకోలేకపోయారని పేర్కొన్నది. ఉపాధి విషయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు చాలా భారీగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు ఉపాధి సూచీల్లో తక్కువ ర్యాంకుల్లో నిలిచాయి. బీహార్, యూపీ, ఒడిశా, మధ్యప్రదేశ్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఏండ్లు పేలవమైన ఉపాధి తీరుతెన్నులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. స్థానికంగా ప్రభుత్వ విధానాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అధ్యయనం ఎత్తిచూపింది.

### ఉపాధి అవకాశాలపై టెక్నాలజీ ప్రభావం

యువత అధికంగా ఉండే భారత్.. వారికి ఉపాధి కల్పన విషయంలో మాత్రం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నదని నివేదిక పేర్కొన్నది. కొవిడ్-19 సంక్షోభం యువత లేబర్ మార్కెట్‌లో సవాళ్లను పెంచిందని తెలిపింది. పెరిగిన సాంకేతికత కూడా ఉపాధిపై ప్రభావం చూపుతున్నదని, నైపుణ్యాల డిమాండ్‌ను పెంచిందని పేర్కొన్నది. యువతలో చాలా మందిలో ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యత లేదని, ఇది నేటి కాలంలో వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నదని నివేదిక స్పష్టం చేసింది. భారత యువతలో 90 శాతం మంది స్ప్రెడ్‌షీట్‌లో మ్యాథ్‌మాటికల్ ఫార్ములా చేయలేకపోతున్నారని, 60 శాతం మందికి ఫైళ్లను కాపీ, పేస్టు చేయడం రాదని, 75 శాతం మందికి అయితే అటాచ్‌మెంట్లతో కూడిన మెయిళ్లను పంపడం తెలియదని పేర్కొన్నది.

### ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరించలేదు!

కాగా, భారత ఉపాధి నివేదిక-2024 విడుదల కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగం వంటి అన్ని సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని అనుకోవడం సరికాదని అన్నారు. ఉపాధి విషయంలో ప్రభుత్వం ఏమి చేయగలదంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సాధారణంగా ప్రపంచంలో వాణిజ్య రంగం నియామకాలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం ఇటీవల స్కిల్ ఇండియా మిషన్లు వంటి కార్యక్రమాలను చేపట్టిందని చెప్పుకొచ్చారు. అయితే అనంత నాగేశ్వరన్ వ్యాఖ్యలపై మరో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రొత్రా స్పందించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, దాని సంబంధిత ఆర్థికవేత్తలు సమస్యను గుర్తించి, దానికి పరిష్కారం చూపే ప్రయత్నం చేయకుండా, భారత జాబ్ మార్కెట్‌పై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

## టీడీపీ నేతల్లో తీవ్ర వేదన

అమరావతి,బీజేపీ, టిడిపి, జనసేన పొత్తులో భాగంగా సీట్లు కోల్పోయిన పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడంతో తమకు సీటు కేటాయించలేదని టిడిపి అధినేతపై బహిరంగానే నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. గట్టిపట్టున్న స్థానంలో కూడా బిజెపి, జనసేనకు సీటు కేటాయించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నేతలకు టికెట్లు కేటాయించకుండా రాజీనామాలకు సైతం వెనకాడబోమని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు హెచ్చరిస్తున్నారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ పట్టు వదలకుండా 'టికెట్' కోసం అభ్యర్థిస్తూనే ఉన్నారు. తాజాగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ కాకుండా, స్థానిక అభ్యర్థికి టికెట్ ఇస్తే తమకు ఏమాత్రమూ అభ్యంతరం లేదన్నారు. తిరుపతి అభ్యర్థి విషయంలో ఎన్నో సర్వేలు చేశారని, ఆ సర్వేల్లో తనకే ఎక్కువ అనుకూలంగా ఓట్లు వచ్చాయన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీటును జనసేన ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్‌కు ఇవ్వాలని

# తెలుగుదేశం కూటమిదే హవా ..

అమరావతి,ఏపీలో పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అధికార పార్టీ నేతల్లో టెన్షన్ పెరుగుతోంది. వైసీపీ అభ్యర్థులు గెలుపుపై బహిరంగంగా ధీమాను వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల ఓటమి భయం వారిని వెంటాడుతోంది. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో దాదాపు ఓటమి ఖాయమన్న భావనకు వైసీపీ అభ్యర్థులు వచ్చినట్లు ఏపీ రాజకీయాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అన్నిప్రముఖ సర్వే ఫలితాల్లోనూ వైసీపీ అధికారాన్ని కోల్పోవటం ఖాయమని తేలుతుండటంతో జగన్ శిబిరంలో రోజురోజుకు ఆందోళన పెరుగుతోంది. ఆ ఆందోళన నుంచే కొన్ని ఫేక్ సర్వేలను వైసీపీ సోషల్ మీడియా ప్రచారంలో పెడుతోంది. తద్వారా ఏపీ ప్రజలను గందరగోళానికి గురిచేసేలా వైసీపీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రముఖ సర్వే సంస్థ ఆత్మసాక్షి సర్వే ఫలితాలు అంటూ మూడు రోజుల క్రితం ఒక సర్వే వెలుగులోకి వచ్చింది. ఈ సర్వే ఫలితాల్లో వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని పేర్కొంది. ఆ సర్వే శ్రీ ఆత్మసాక్షి ఒరిజినల్ సర్వే అంటూ వైసీపీ సోషల్ మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. ఇప్పటి వరకు వచ్చిన అన్ని ప్రముఖ సంస్థల సర్వేల ఫలితాల్లో కూటమి విజయం ఖాయమని తేలింది. కానీ, ఆత్మసాక్షి సర్వే అంటూ వైసీపీ నేతలు ప్రచారం చేసిన సర్వేలో మాత్రం వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఆ సర్వే విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో నే శ్రీ ఆత్మసాక్షి తాజా సర్వే ఫలితాలు వెలుగులోకి రావటంతో వైసీపీ నేతల కుట్రలు ఏమిటో మరోసారి తేటతెల్లమయ్యాయి.రాష్ట్రంలో ఎన్నికల తేదీ దగ్గరపడే కొద్దీ సర్వేలపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే వెల్లడైన ప్రముఖ సర్వేలన్నింటిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిదే విజయం అని తేలింది. తాజాగా ప్రముఖ సర్వే సంస్థల్లో ఒకటైన శ్రీఆత్మసాక్షి తమ సర్వే ఫలితాలను వెల్లడించింది. జగన్ మోహన్ రెడ్డికి బిగ్ షాక్ తప్పదని సర్వే పేర్కొంది. ఏపీలో ప్రస్తుత పరిస్థితిని బట్టిచూస్తే జగన్ పార్టీకి 21 నుంచి 25 అసెంబ్లీ సీట్లకు మించి రావని శ్రీ ఆత్మసాక్షి సర్వే పేర్కొంది. ఈ సర్వే ఫలితాల ప్రకారం. అధికార వైసీపీకి 41.5శాతం, కూటమికి 53.5 శాతం ఓటింగ్ నమోదవుతుందని తేలింది. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 136 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, 21 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని శ్రీ ఆత్మసాక్షి సర్వే పేర్కొంది. ఇక 18 నియోజకవర్గాల్లో కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని ఆ హోరాహోరీ స్థానాలలో కూడా పదికిపైగా స్థానాల్లో కూటమి అభ్యర్థులకే ఎడ్జ్ ఉంటుందనీ పేర్కొంది. పార్లమెంట్ ఫలితాల్లోనూ కూటమిదే హవా కొనసాగనుంది. 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో 20 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, రెండు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని సర్వే ఫలితాల్లో తేలింది. మూడు స్థానాల్లో కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని, అందులోనూ రెండు స్థానాల్లో కూటమి అభ్యర్థి, ఒక స్థానంలో వైసీపీ అభ్యర్థికి ఎడ్జ్ ఉంటుందని ఆత్మసాక్షి సర్వే పేర్కొంది. ఉమ్మడి జిల్లాల వారిగా శ్రీ ఆత్మసాక్షి సర్వే ఫలితాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని శ్రీ ఆత్మసాక్షి సర్వే పేర్కొంది. విజయనగరం ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో ఐదు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం ఖాయమని, నాలుగు నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థులు, వైసీపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని, వీటిల్లోనూ మూడు సీట్లలో కూటమి అభ్యర్థులకే విజయావకాశాలు ఉంటాయని సర్వే పేర్కొంది.విశాఖపట్టణం ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 14 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని, కేవలం ఒక్క నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి విజయం సాధించే అవకాశం ఉందని శ్రీ ఆత్మసాక్షి సర్వే పేర్కొంది. విశాఖపట్టణాన్ని పరిపాలనా రాజధానిగా మార్చుతానని సీఎం జగన్ చెప్పినప్పటికీ.. అక్కడి ప్రజలు జగన్, వైసీపీ నేతలను నమ్మే



పరిస్థితిల్లో లేరని శ్రీ ఆత్మసాక్షి సర్వే ఫలితాన్ని బట్టి అర్థమౌతుంది. రాజధాని పేరుతో ఇప్పటికే వైసీపీ నేతలు విశాఖలో భూదందాకు భారీగా తెరలేపారు. దీంతో విశాఖ ప్రజలు రాజధాని అంటేనే ఆందోళన చెందుతున్న పరిస్థితి.

ఉమ్మడి తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 నియోజకవర్గాలు ఉండగా వాటిలో 17 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు, ఒక నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి విజయం సాధిస్తారని సర్వే తేల్చింది. ఒక నియోజకవర్గంలో హోరాహోరీ పోరు ఉంటుందని, అందులోనూ టీడీపీ కూటమి అభ్యర్థికే ఎడ్జ్ ఉంటుందని పేర్కొంది. అదే విధంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను.. 13 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, రెండు నియోజకవర్గాల్లో హోరాహోరీ పోరు ఉంటుందని.. అందులో నూ ఒక నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి, మరో నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఎడ్జ్ సాధించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 16 నియోజకవర్గాలు ఉండగా, 15 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధింస్తారని, ఒక నియోజకవర్గంలో హోరాహోరీ పోరు ఉంటుందని, అందులోనూ కూటమి అభ్యర్థులకే విజయావకాశాలు ఉంటాయని సర్వే పేర్కొంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని 17 నియోజకవర్గాల్లో 16 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, ఒక స్థానంలో హోరాహోరీ పోరు ఉంటుందని, అందులోనూ కూటమి అభ్యర్థి విజయానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శ్రీ ఆత్మసాక్షి సర్వే పేర్కొంది.ప్రకాశం ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల్లో ఎనిమిది స్థానాల్లో కూటమి అభ్యర్థులు, మూడు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు, ఒక నియోజకవర్గంలో హోరాహోరీ పోరు ఉంటుందని, అందులో వైసీపీ అభ్యర్థి విజయానికి అవకాశాల ఉంటాయని సర్వే ఫలితాల్లో తేలింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ని 10 నియోజకవర్గాల్లో తొమ్మిది స్థానాల్లో కూటమి అభ్యర్థులు, ఒక స్థానంలో వైసీపీ అభ్యర్థి విజయం సాధించే అవకాశం ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో 10 నియోజక వర్గాల్లో ఐదు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని, రెండు స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని సర్వే ఫలితాల్లో తేలింది. మూడు స్థానాల్లో హోరాహోరీ పోరు ఉంటుందని, వాటిల్లో రెండింటిలో వైసీపీ అభ్యర్థులు, ఒక స్థానంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించే అవకాశం ఉంటుందని అంచనా వేసింది. కర్నూల్ ఉమ్మడి జిల్లాలో ని 14 నియోజకవర్గాల్లో ఆరు స్థానాల్లో కూటమి అభ్యర్థులు, ఆరు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని సర్వే ఫలితాల్లో తేలించింది. రెండు స్థానాల్లో హోరాహోరీ పోరు సాగుతుందని, వాటిల్లో ఒకటి కూటమి అభ్యర్థి, ఒకటి వైసీపీ అభ్యర్థి గెలుచుకునే అవకాశాలు ఉంటాయని పేర్కొంది.ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 11 స్థానాల్లో కూమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, ఒక స్థానంలో వైసీపీ అభ్యర్థి, మరో రెండు స్థానాల్లో హోరాహోరీ పోరు ఉంటుందని సర్వే తేల్చింది.చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాల్లో 10 స్థానాల్లో కూటమి అభ్యర్థులు, మూడు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి. ఒక స్థానంలో హోరాహోరీ పోరు ఉంటుందని, అయితే ఆ ఒక్క స్థానంలో కూడా వైసీపీ అభ్యర్థి విజయానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని శ్రీ ఆత్మసాక్షి సర్వే పేర్కొంది.

# నీటికి కటకటలు..

న్యూఢిల్లీ,వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయరాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అవసరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముున్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కటు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఈ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారినప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు. ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి. నీటి లభ్యత లేని సమయంలో ఎగువ రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని వాడుకుంటే కిందికి చుక్కరాదు. దిగువ రాష్ట్రం అనివార్యంగా నష్టపోవాల్సిందే. కొత్తగా తెలంగాణ ఏర్పడ్డ కారణంగా ఇప్పుడు నీటిని అన్ని రాష్ట్రాలు సమానంగా పంచుకునేలా తీర్పు ఉండాలి. అప్పుడే న్యాయం జరగగలదు.

# సింగరేణి షాక్..

హైదరాబాద్,అలాంటి కేసీఆర్ కు గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి అంతా మారిపోయింది. అధికారంలో ఉన్నప్పుడు అందరూ బంధువులు.. స్నేహితులే. కానీ.. ఒక్కసారి చేతిలో ఉన్న అధికారం చేజారితో లెక్కలు మారిపోతాయి. సమీకరణాల్లో తేడాలు వెలుగు చూస్తాయి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో గులాబీ బాస్ కు ఎత్తుపల్లాల గురించి ఎవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాకుంటే.. గడిచిన పదేళ్లలో ఆయన ఏం అనుకుంటే అదే జరిగేది. కాలం సైతం ఆయన్ను పరీక్షించలేదు సరికదా.. ఆయనే కాలానికి పరీక్ష పెట్టారన్న మాట వినిపించేది. అలాంటి కేసీఆర్ కు గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి అంతా మారిపోయింది. కలలో కూడా ఊహించని ఓటమి ఎన్నికల్లో ఎదురుకావటమే కాదు.. అధికారం చేజారింది. కాంగ్రెస్ పార్టీకి విజయం వరించింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయినప్పటికీ మహా అయితే నెల చాటు ప్రభుత్వం పడిపోవటానికి అన్న ధీమాతో మొదలైన ఎదురుదెబ్బలు.. ఒకటి తర్వాత ఒకటి చొప్పున తగులుతూనే ఉన్నాయి. చూస్తుండగానే వంద రోజులు గడిచిపోయాయి. ఏం చేస్తాడులే అన్న రేవంత్ రెడ్డి ఒక్కొక్కటి చేసుకుంటూ పోతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ లో లుకలుకలు మొదలయ్యాయి. ఊహించని పరిణామాలు.. అంచనాలకు మించిన నష్టాలు ఎదురవుతున్నాయి. గులాబీ బాస్ కుమార్తె కవితను ఈడీ అరెస్టు చేయటం మొదలు.. కలలో కూడా పక్కకు వెళ్లరనుకున్న పలువురు నేతలు కారు నుంచి వీడిపోవటం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు ఎన్నికలు వస్తే.. అభ్యర్థుల రేసులో కుప్పలు కుప్పలుగా ఉండే స్థాయి నుంచి మీరు పోటీ చేయాలని గులాబీ బాస్ కోరినా.. సారీ.. ఆ పని మాత్రం చేయలేమంటూ ముఖానే చెప్పేసే దుస్థితి. ఇన్ని ఎదురుదెబ్బల వేళ.. మరో ఎదురుదెబ్బ తాజాగా తగిలింది. కీలకమైన పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలింది. సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఇకపై తాను బీఆర్ఎస్ తో కలిసి అడుగులు వేయనని తేల్చి చెప్పింది. తమకు కారు పార్టీతో సంబంధాలు తెగిపోయిన వైనాన్ని వెల్లడించింది.

# సలహాదారు చంద్రశేఖర్ రెడ్డిని తొలగించాలి

అమరావతి,జగన్ ప్రభుత్వంలో సలహాదారుగా వ్యవహరిస్తున్న చంద్రశేఖర్ రెడ్డిని వెంటనే ఆ పదవిలో నుంచి తొలగించాలని రాష్ట్ర ఎన్నికల సీఈవో ముఖేష్ కుమార్ మీనాకు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ విజ్ఞప్తి చేసింది. ఎన్నికల వేళ చంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఆయన్ని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలంటూ.. సీఈవో మీనాను కలిసి విజ్ఞప్తి చేసింది. అనంతరం ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం చూడాల్సిన సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలను విమర్శిస్తూ.. వైసీపీకి ఓట్లు వేయాలంటూ ఉద్యోగులు, వాలంటీర్లను ఆయన ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. చంద్రశేఖరరెడ్డి హయాంలో ఉద్యోగుల సంక్షేమం ఏమాత్రం జరగలేదని ఆయన స్పష్టం చేసింది. ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ రావడం, క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పోవడం, డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయని.. వాటి వేటిని ఆయన అసలు పట్టించుకోలేదని మండి పడ్డారు. అయితే ఆయన తన జీతభత్యాల కోసం, టీఏ, డీఏల కోసం తన హోదాను చూపించుకోవడం కోసం ప్రభుత్వ సలహాదారుడిగా ఉంటున్నారని తెలిపారు. ఇక పెన్షనర్స్ కోసం, ఉద్యోగుల కోసం ఆయన ఏ మాత్రం పని చేయలేదని చెప్పారు. చంద్రశేఖరరెడ్డి ఉద్యోగ సంఘం నేతగా, మాజీ ఉద్యోగిగా ఉద్యోగులను ప్రలోభపెడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో తన కార్యాలయాన్ని దుర్వినియోగం చేసి రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిబంధనలను అనుసరించి వెంటనే ఆ పదవి నుంచి చంద్రశేఖరరెడ్డిని తప్పించాలని ఎన్నికల సంఘం సీఈవోని కోరినట్లు చెప్పారు. ఈ విషయంలో గవర్నర్, ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి కలుగ చేసుకొని చంద్రశేఖర్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# యువత కోసం 20లక్షల ఉద్యోగాలు

చిత్తూరు, యువత కోసం 20లక్షల ఉద్యోగాలు ఎదురు చూస్తున్నాయని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపడతామని ప్రకటించారు.ప్రజాగళం ప్రచార కార్యక్రమంలో భాగంగా పుత్తూరు బహిరంగ సభలో పాల్గొన్న మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై వైసీపీ సర్కారుపై నిప్పులు చెరిగారు. ఎన్నికలు వస్తుండడంతో ముసుగు వీరుడు జగన్ మోహన్ రెడ్డి మొట్టమొదటిసారి తాడేపల్లి దాటి వస్తున్నాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల వద్ద ఆస్తి.. ఒక్క జగన్మోహన్ రెడ్డి దగ్గరే ఉందని మండిపడ్డారు. ఈయన తాను పేదవాడు అని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.చిత్తూరు జిల్లా పుత్తూరులో నిర్వహించిన ప్రజాగళం ప్రచారసభలో ఆయన ప్రసంగించారు. అధికారంలోకి వచ్చాక .. 60 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.'చదువుకున్న యువతకు ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా? యువతకు ఉద్యోగాలు రావాలంటే ఎన్డీయేకు ఓటు వేయాలి. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చెప్పే వ్యక్తి జగన్. ఆయనో అబద్దాల కోరు. బోగస్ సర్వేలు చేయిస్తారు. రాజకీయాలకు పనికిరాడు. పేదల మనిషి ఎవరో.. పెత్తందారు ఎవరో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. మేం ప్రారంభిం చామనే అన్న క్యాంటీన్లు రద్దు చేశారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తీసుకొస్తాం. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే పొత్తు పెట్టుకున్నాం. కేంద్రంలో మళ్లీ భాజపానే అధికారంలోకి వస్తుంది. ఐదేళ్ల ప్రజల ఆవేదన.. వచ్చే ఎన్నికల్లో అగ్నిగా మారాలని అన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను ఓడించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. మేం ఉన్నప్పుడు ఐదేళ్లపాటు కరెంట్ ఛార్జీలు పెంచలేదు. పేదల కష్టాలు ఏమాత్రం తెలియని వ్యక్తి జగన్. రూ.60ల మద్యాన్ని రూ.200లకు అమ్ముతున్నారు. ఈ ఐదేళ్లలో మీ ఆదాయం పెరిగిందా.. తగ్గిందా? పేదలను నిరుపేదలుగా మార్చిన పెత్తందారు జగన్. పేదల జీవితాల్లో వెలుగులు చూపించే బాధ్యత నాది. మహిళలను వేధించిన వారు బాగుపడినట్టు ఎక్కడా లేదు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఆడబిడ్డ నిధి ఇస్తాం. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తాం. అన్నదాత కింద రైతుకు ఏటా రూ.20వేలు ఇస్తాం. బీసీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తాం. మేం వచ్చాక ఐదేళ్ల పాటు కరెంటు ఛార్జీలు పెరగవు. చేనేత కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ తెస్తాం. నగరిలో ప్రతి ఎకరాకు నీరిచ్చే బాధ్యత నాది అని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుని మార్చే తేదీ మే 13. జగన్ అహంకారం కూలిపోయి, తాడేపల్లి ప్యాలెస్ ను బద్దలు కొట్టేది ఆ రోజే. సొంత తోబుట్టునే అవమానించిన రాక్షసుడు జగన్. మహిళను బాధపెట్టిన ఎవరూ బాగుపడలేదని వైఎస్ జగన్‌పై చంద్రబాబు ధ్వజమెత్తారు. పన్నుల భారం లేని పరిపాలన అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. జగన్ ప్రజల్ని గొర్రెలను కొన్నట్టుగా కొని ఇష్టానుసారం చేశారని, ముసుగు వీరుడు మొట్టమొదటిసారి తాడేపల్లి దాటి వస్తున్నాడని పంచ్‌లు వేశారు. విదేశీ విద్య పథకాన్ని రద్దు చేసిన పెత్తందారు జగన్మోహన్ రెడ్డి అని మండిపడ్డారు. టిడ్కో ఇళ్లను రద్దు చేసిన పెత్తందారుడు జగన్. దళితుడిని చంపి ఇంటికి పంపిన వారితో కులికే పెత్తందారుడు జగన్. అలాగే నగరి ప్రజాగళం ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆర్కే రోజాపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. జబర్దస్త్ ఎమ్మెల్యే రోజా నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మండిపడ్డారు. మున్సిపాలిటీలో పదవి ఇస్తామని రూ.40 లక్షలు తీసుకున్నారని చంద్రబాబు ఆరోపించారు. నగరి నియోజకవర్గంలో అడుగడుగునా అరాచకం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక దోపిడికి అడ్డూ అదుపు లేదన్నారు. చివరికీ మట్టిని కూడా వదలడం లేదని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాను ప్రకాష్ ప్రజలు మెచ్చిన నాయకుడని చంద్రబాబు ప్రశంసించారు. ప్రజలు కోరడంతో టికెట్ ఇచ్చానని వివరించారు. గాలి ముద్దుకృష్ణమ నాయుడుని తలపించేలా భాను ప్రకాష్ ప్రజా సేవ చేస్తారని వివరించారు. భానుని ఆ విధంగా తయారు చేస్తానని చంద్రబాబు జనాలకు వివరించారు. దివంగత గాలి ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడు భాను ప్రకాశ్ అనే సంగతి తెలిసిందే. పవర్ రూములకి 400 యూనిట్ల కరెంట్ ఇస్తాం అని చెప్పి సీఎం జగన్ మాట తప్పారని చంద్రబాబు విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీనిచ్చారు. పవర్ లూమ్ కార్మికులకు 5 యూనిట్ల కరెంట్ ఫ్రీగా ఇస్తామని వివరించారు. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ తిరిగి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నగరిలో పారిశ్రామిక వాడను తీసుకొస్తామని ప్రకటించారు. టెక్స్ టైల్ పార్క్ కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఉద్యోగం కోసం ఇక్కడి నుంచి చెన్నై వెళ్లే పరిస్థితి ఇకపై ఉండదని చెప్పారు. నగరికి నీళ్లు తీసుకొచ్చే వేణుగోపాల సాగర్ హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. నగరి పుత్తూరులో సమ్మర్ స్టోరేజ్ పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

# ఏపి బిజెపిలో అంతా అమితోత్సాహం...

అమరావతి :కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టి.. మరో చరిత్ర సృష్టించాలని మోదీషా ద్వయం యత్నిస్తోంది. నవీన రాజకీయ పాచికలతో ప్రత్యర్థి శిబిరాలను నిర్వీర్యం చేస్తోంది. అలవికాని చోట అధికులమనరాదు అనే సూక్తిలో అర్థాన్నే మార్చే ప్రణాళికతో ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతోంది. ఇక.. ఏపీలో అంతంత మాత్రమే ఉన్న తమ ఉనికిని తారా స్థాయికి తీసుకువెళ్లే వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోంది. ఈ తరుణంలో కమలదండులోని పాత కొత్తల జగడం కాస్తా ఏపీ బీజేపీకి చుక్కలు చూపిస్తోంది. టీడీపీ, జనసేన పొత్తుతో ఆరు లోక్‌సభ స్థానాల్లో పాగాకు రెడీ కాగా.. ఇప్పటికే నాలుగు స్థానాల్లో విజయం ఖాయమని కమల దండు చిందులేస్తోంది. అయితే.. మరో మూడు స్థానాల్లో అభ్యర్థులపై అసంతృప్తి ఉందని ఆ పార్టీ నేతలే స్పష్టం చేస్తున్నారు. మరీముఖ్యంగా రెండు చోట్ల గెలిచే అభ్యర్థులను పక్కన పెట్టి.. అసలు గెలుపునకే అవకాశం లేని సీట్లను సర్దుకున్నారనే చర్చ కూడా పీక్ లెవల్‌కి చేరింది. ఎన్నికల ముందే ఏపీ కమలదళంలో నెలకొన్ని పరిస్థితిని పరిశీలిస్తే.. ఓం.. భీమ్.. బుష్.. అంతా అమితోత్సాహంలాగా కనిపిస్తోంది.ఏపీలో ఆరు ఎంపీ స్థానాల్లో పోటీకి తమ కమలదళాన్ని బీజేపీ సిద్ధం చేయగా%ా% సామాజిక, ఆర్థికాంశాల్లో బీజేపీ వ్యూహంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2014 ఎన్నికల్లో టీడీపీతో ప్రత్యక్షంగా.. జనసేనతో పరోక్షంగా పొత్తు పెట్టుకున్న బీజేపీ నాలుగు ఎంపీ స్థానాల్లో పోటీ చేసి.. రెండింటిని కైవశం చేసుకుంది. 2024 ఎన్నికల్లో ఇవే రెండు పార్టీల పొత్తుతో ఆరు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంది. అరకు (ఎస్టీ), తిరుపతి (ఎస్సీ), అనకాపల్లి (వెలమ), రాజమండ్రి (కమ్మ), నరసాపురం (క్షత్రియ), రాజంపేట (రెడ్డి) సామాజిక వర్గాలకు కేటాయించింది. తెలంగాణ ఎన్నికల్లో బీసీ కార్డును మోత మోగించిన బీజేపీ పెద్దలు.. ప్రతి ఎన్నికల సభలోనూ బీసీల పక్షమని గట్టిగా వక్కాణిస్తున్నారు. కానీ ఏపీ లోక్ సభ అభ్యర్థుల్లో కనీసం ఒక్క బీసీ అభ్యర్థిని కూడా తెరమీదకు తీసుకు రాకపోవటం విశేషం. ఈ విషయం సరే..

కాషాయ పసుపు సేన స్థితి ఏమిటి?

ఏపీలో 2019 లోక్ సభ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల సొంత బలాన్ని పరిశీలిస్తే అరకులో వైసీపీకి టీడీపీ, జనసేన గట్టిపోటీ ఇస్తే.. రాజమండ్రి, నరసాపురం సెగ్మెంట్లలో జనసేన బలంతోనే టీడీపీ ఓడిపోయింది. ఇక అనకాపల్లి లోక్ సభ స్థానంలో జనసేన ఓట్లు చీల్చటం వల్లనే టీడీపీ అభ్యర్థి ఓడిపోక తప్పలేదు. ఇక తిరుపతి, రాజంపేట నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయలేదు. ఈ మొత్తం ఆరు సీట్లల్లో నాలుగు సీట్లల్లో జనసేన ప్రభావం ఎక్కువగానే ఉంది. ఈ స్థితిలో అరకు, రాజమండ్రి, నరసాపురం, అనకాపల్లి స్థానాల్లో వైసీపీకి గట్టి దెబ్బ తప్పదని రాజకీయ విశ్లేషకుల అంచనా. కాగా వైసీపీ కంచుకోటలో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కూడా తన సొంత బలంతో వైసీపీని కంగుతినిపిస్తారని, రాజకీయ ప్రస్థానంలో పునర్జీవనం కోసం కిరణ్ కుమార్ రెడ్డి వర్గం తీవ్రంగా పని చేస్తుందని ఓ అంచనా.

గెలుపు గుర్రాలకు కళ్లాలెన్నో..

బీజేపీ గెలుపు గుర్రాలుగా అంచనా వేస్తున్న అభ్యర్థులకు అడ్డంకులూ కనిపిస్తున్నాయి. ఒకటి పొత్తు జాడ్యం. రెండు అభ్యర్థుల బలహీనతలు. మూడు సామాజిక వర్గం ముభావం. రాజమండ్రి నుంచి పురందేశ్వరీ విజయం దాదాపు ఖాయంగానే అంచనా వేస్తున్నారు. ఇక్కడ కమ్మ సామాజిక వర్గం బలంగా ఉంది. అదే విధంగా జనసేన చేతిలోని సామాజిక వర్గమూ పవన్ కళ్యాణ్ కోసం కదం తొక్కుతోంది. ఐతే, గత రెండు ఎన్నికల్లో మాగంటి మురళీ మోహన్



కుటుంబానికి ఎదురు దెబ్బ తప్పలేదు. 2009లో ఉండవల్లి అరుణ్కుమార్ మీద స్వల్ప మెజారిటీతో మురళీ మోహన్ ఓడిపోయారు. ఈ స్థితిలో పురందేశ్వరీ విజయానికి తెలుగుదేశం, జనసేన కృషి తప్పని సరి. బీజేపీపై ఏమాత్రం వ్యతిరేకతతో క్రాస్ ఓటింగ్ జరిగినా పురందేశ్వరీకి నిరాశ తప్పదు. అనకాపల్లిలో సీఎం రమేష్కన్ లోకల్ హీరో కావటం తొలి అవరోధంగా కనిపిస్తోంది. అరకులో మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు స్థానిక బలం పర్వాలేదు. దీనికి తోడు ప్రస్తుత ఎంపీ గొడ్డేటి మాధవికి వైసీపీ టిక్కెట్టు ఇవ్వలేదు. అంటే ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వైసీపీకి కొత్తపల్లి గీత చుక్కలు చూపించటం ఖాయమని బీజేపీ వర్గాల అంచనా. ఇక తిరుపతి, రాజంపేటల్లో వైసీపీకి గట్టిపోటీ తప్పదు. ఈ రెండు స్థానాల్లో గెలిచే గుర్రాల అంచనాలోనే రాజకీయ పండితులు జుట్టు పీక్కుంటున్నారు.

నరసాపురంలో నీరసం

నరసాపురం లోక్ సభ అభ్యర్థి అంగబలం, ఆర్థిక బలంపైనే ఆందోళన నెలకొంది. భూపతిరాజు శ్రీనివాస వర్మ నిజానికి బీజేపీ సొంత బిడ్డ. ఆర్ ఎస్ ఎస్ పునాదిలో వీహెచ్ పీ శిక్షణలో ఆరితేరిన కమలనాథుడే. కానీ నరసాపురం పరిస్థితి ఇందుకు బిన్నం . ఇక్కడ ఆర్థిక స్థితిమంతుడే పోటీకి అర్హుడని రాజకీయ విశ్లేషకుల అంచనా. 1999లో తెలుగుదేశం పొత్తుతో సినీ హీరో ఉప్పలపాటి వెంకట కృష్ణం రాజు బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఇక 2014లోనూ టీడీపీ పొత్తుతో గోకరాజు గంగరాజు గెలిచారు. నిజానికి 2024లో గోకరాజు గంగరాజు , కృష్ణం రాజు సతీమణి బీజేపీ అభ్యర్థిగా పోటీలో దిగే అవకాశం ఉందని అందరూ ఊహించారు. కానీ వైసీపీపై తిరుగుబాటు ప్రకటించిన రఘురామ కృష్ణం రాజుకే నరసాపురం సీటు ఖాయమని అంచనాలు తెరమీదకు వచ్చాయి.

రఘురామకు మొండిచెయ్యి..

రఘురామకృష్ణం రాజుకు బీజేపీ మొండి చెయ్యి చూపింది. ఇందుకు ప్రధాన కారణం%ా% ఆయన ఏ పార్టీలోనూ నికరంగా నిలబడరని, వైసీపీనే లెక్క చేయలేదని, కనీసం ఆ పార్టీకి రాజీనామా చేయకుండా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించటంతో బీజేపీ వెనకడుగు వేసింది. 2009 ఎన్నికల్లో కేవలం 11 వేల ఓట్లు సాధించిన భూపతిరాజు శ్రీనివాస వర్మనే తమ అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీకి విశ్వాసపాత్రుడు కావటంతోనే ఈ అవకాశం ఆయనకు దక్కింది. ఇక బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత టీడీపీ, జనసేనదే కావటంతో%ా% శ్రీనివాస వర్మ బరువు, బాధ్యతలు కూటమికే అప్పగించారు. ఇదిలా ఉంటే.. వైసీపీకి అనుకూల నిర్ణయంగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. రామకృష్ణంరాజుకు బీజేపీ టిక్కెట్టును దూరం చేయటంలో వైసీపీ కీలక పాత్ర పోషించిందని, ఒక సీనియర్ నాయకుడిని రంగంలోకి దించిందని ఇప్పటికే ప్రచారం ఊపందుకుంది.

# కళా డ్రాప్?.. రఘురామరాజుకు విజయనగరం ఆహ్వానం



అమరావతి,సార్వత్రిక ఎన్నికల వేళ ఏపీలో టికెట్ల కేటాయింపుల గోల మొదలయ్యింది. ఆశపడ్డవారి కలలు చెదరటం కథ మారటం సర్వసాధారణం. అధికారపార్టీలో అధినేతను లెక్కచేయక తిరుగుబావుటా ఎగరేసిన రఘురామకు ఇప్పుడు టికెట్టు దక్కకుండా పోయింది. ప్రతిపక్ష పార్టీ చేతిలో వజ్రాయుధం అనే ముద్ర సాధించిన నరసాపురం ఎంపీ కల చెదిరింది. కథ మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా నరసాపురంలో వైసీపీ సంగతి తేల్చేస్తానని ప్రకటించిన రఘురామకు టిక్కెట్టు దొరకలేదు. త్రికూటమి పొత్తులో ఈ సీటు బీజేపీ వశం కాగా.. సొంత పార్టీ విశ్వాస పాత్రుడికే కాషాయ దళం పట్టం కట్టింది. దీంతో రఘురామకృష్ణరాజు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అయితే.. ఈ స్థితిలో మరో రాజుల కోట స్వాగతం పలుకుతోంది. రఘురామను విజయనగర సామ్రాజ్యాధినేతగా ప్రతిష్ఠించటానికి పసుపు సేన పావులు కదుపుతున్నట్టు సమాచారం అందుతోంది. ఏపీలో ఎన్నికల పొత్తు.. బీజేపీ పాచికలో కంగుతిన్న నరసాపురం సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణ రాజు స్థితి, గతి మారబోతోంది. విజయనగరం లోకసభ స్థానం వరించబోతోందనే కబురు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. ఏపీలో బీజేపీ ఆరు లోక్?సభ స్థానాలకు తమ అభ్యర్థులను ఖరారు చేసింది. పొత్తులో విజయనగరం సీటు బీజేపీకి కేటాయించగా.. తర్వాత జరిగిన చర్చల్లోరాజంపేట సీటును కోరి మరీ బీజేపీ తీసుకుంది. రాజంపేట నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పుడు విజయనగరం సీటు టీడీపీకి దక్కింది. సీఎం జగన్?ను విభేదిస్తూ చంద్రబాబుకు సహకరించిన రఘురామకృష్ణ రాజుపై టీడీపీ మమకారం పెంచుకుంది. జగన్?పై నిత్యం ఆరోపణల మిసైల్స్ సంధించే రఘురామ పార్టీకి ఎంతో అవసరమని టీడీపీ పెద్దలు భావించారు. దీనికి తోడు ఆర్థిక బలంలోనూ తిరుగులేని అభ్యర్థిగా పేరుంది. ఈ స్థితిలో రఘురామకు వెన్నుదన్నుగా నిలవటమే కాకుండా.. ప్రత్యర్థి వైసీపీ శిబిరంలో కలకలం రేపటానికి టీడీపీ వ్యూహం రచించింది. విజయనగరం సీటును తనకు ఇవ్వబోతున్నారనే సమాచారంతో రఘురామ సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ కానున్నారని సమాచారం.

విజయనగర సామ్రాజ్యంలోకి

విజయనగరంలో రఘురామను బరిలో దించాలని చంద్రబాబు ఎందుకు ఆలోచిస్తున్నారంటే.. విజయనగరం నుంచి అభ్యర్థిగా మళ్లీ బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారు. మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు విజయనగరం నుంచి గతంలో ఎంపీగా గెలిచారు. క్షత్రియ సామాజిక ఓటర్లు విజయనగరం పరిధిలోనే అత్యధికంగా ఉన్నారు. దీంతో విజయనగరం టీడీపీ సీటును రఘురామకు ఇస్తున్నారని కొద్ది గంటల్లోనే ప్రచారం మొదలైంది. తొలుత విజయనగరం నుంచి ఏపీ టీడీపీ మాజీ అధ్యక్షుడు కళా వెంకట్రావు పేరు పరిశీలనలో ఉంది. ఆయన సొంత నియోజకవర్గ ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించారు. దీంతో కళా లోక్?సబకు పోటీ చేయాలని చంద్రబాబు సూచించారు. కానీ, కళా వెంకట్రావు అందుకు సిద్ధంగా లేరు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు కుమార్తెకు విజయనగరం అసెంబ్లీ సీటు ప్రకటించారు. అశోక్ గజపతి ఈసారి పోటీకి దూరంగా ఉన్నారు. ఈ సమయంలో రఘురామను విజయనగరం నుంచి పోటీ చేయిస్తే ఎలా ఉంటుందనేది చర్చ జరిగింది. ఇదే విషయాన్ని చంద్రబాబు సీనియర్ నేత అశోక్ గజపతిరాజుతో చర్చించినట్లు తెలుస్తోంది. అశోక్ గజపతి కూడా రఘురామవైపే మొగ్గు చూపారని ప్రచారం జరుగుతోంది.

టీడీపీ అధినేత తర్జన భర్జన

పొత్తులో భాగంగా రఘురామకు బీజేపీ టిక్కెట్టు నిరాకరించిన స్థితిలో తమ పార్టీ అవకాశం కల్పిస్తే కమలనాథులు ఎలా స్పందిస్తారనేది ఇక్కడ కీలక అంశంగా మారింది. దీనికి ఈ స్థితిలో బీజేపీ నేతలతో చర్చించిన తర్వాతనే చంద్రబాబు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రఘురామ తమ పార్టీలో చేరలేదని, తమ పార్టీ నేతలను కాదని టిక్కెట్టు ఇవ్వటం సరికాదని బీజేపీ నేతలే అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో టీడీపీలో చేర్చుకొని విజయనగరం సీటు ఇవ్వడం పైన చంద్రబాబు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిజానికి రఘురామకు ఏదోక నియోజకవర్గంలో సీటు ఇవ్వక పోతే వైసీపీ దూకుడు తట్టుకోలేమని, దీనికి తోడు నరసాపురంలో బీజేపీ అభ్యర్థి గెలవాలంటే.. ఎన్నికల్లో రఘురామ పోటీ చేయాల్సిందేనని టీడీపీ పెద్దలు వాదిస్తున్నారు. విజయనగరంలో రఘురామ గెలుపు ఖాయమని టీడీపీ అంచనా వేస్తోంది. ఈ సీటుపైన చంద్రబాబు రెండు రోజుల్లోనే తన నిర్ణయం ప్రకటిస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు.

అథోఃపాతాళానికి తొక్కక పోతే పేరు మార్చుకుంటా: రఘురామ వార్నింగ్

తనకు నర్సాపురం టికెట్ రాకుండా సీఎం జగన్ అడ్డుకున్నారని నరసాపురం ఎంపీ రఘురామ అన్నారు. బీజేపీ ఏపీ మాజీ చీఫ్ సోము వీర్రాజు ద్వారా యత్నించి.. తనకు సీటు రాకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయంలో ఓటమిని అంగీకరిస్తున్నానంటూ రఘురామ కామెంట్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్లో ఒక వీడియో విడుదల చేశారు. తనకు టికెట్ కేటాయించకపోవడం కొందరికి ఆనందాన్నిచ్చినా.. చాలా మంది బాధపడుతున్నారన్నారు. తనకు చాలా ఫోన్ కాల్స్ వచ్చాయని, కానీ ఆన్సర్ చేయలేక పోతున్నట్టు తెలిపారు. మూడు అడుగులు వెనక్కి వేస్తున్నా.. నాలుగో అడుగు ప్రజల అండతో ముందుకు వేస్తానన్నారు. జగన్ మోహన్ రెడ్డిని రాజకీయంగా అథోః పాతాళానికి తొక్కకపోతే పేరు మార్చుకుంటా అని చాలెంజ్ చేశారు.

# పదిస్థానాలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ, ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను భాజపా విడుదల చేసింది. తెదేపా, జనసేనతో పొత్తులో భాగంగా ఆ పార్టీకి 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే భాజపా ఐదో జాబితాలో ఆరుగురు ఎంపీ అభ్యర్థులను ప్రకటించారు. తాజాగా పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో పది మంది అభ్యర్థులతో భారతీయ జనతా పార్టీ జాబితా విడుదల చేసింది. సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల గెలుపు ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎచ్చర్ల నుంచి ఈశ్వరరావు, విశాఖపట్నం వెస్ట్ విష్ణు కుమార్ రాజు, అరకు వ్యాలీ రాజారావు, ధర్మవరం సత్యకుమార్, అనపర్తి శివకృష్ణ రాజు, కైకలూరు కామినేని శ్రీనివాసరావు, విజయవాడ వెస్ట్ సుజనా చౌదరి, బద్వేలు బొజ్జ రోషన్, జమ్మలమడుగు ఆదినారాయణ రెడ్డి, ఆదోని పార్థసారథి బరిలోకి దిగుతారు. సుజనా చౌదరి రాజ్యసభ పదవికాలం పూర్తి కావడంతో ఈ సారి అసెంబ్లీ బరిలో నిలిచారు. లోక్‌సభ అభ్యర్థులుగా అరకు : కొత్తపల్లి గీత, అనకాపల్లి: సీఎం రమేష్, రాజమహేంద్రవరం : పురందేశ్వరినర్సాపురం : భూపతిరాజు శ్రీనివాస వర్మ, తిరుపతి (ఎస్సీ) : వరప్రసాదరావు, రాజంపేట : కిరణ్ కుమార్ రెడ్డిలను బరిలోకి దింపింది.

# లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

న్యూఢిల్లీ,లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించలేదు. తన అరెస్ట్‌ను, ఈడీ కస్టడీకి పంపుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ.. ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తనను అక్రమంగా ఈడీ అరెస్ట్ చేసిందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. బుధవారం ఈ పిటిషన్‌ను న్యాయస్థానం విచారించింది. అయితే.. తనకు ఉపశమనం లభించవచ్చని ఆశించిన కేజ్రీవాల్‌కు నిరాశే ఎదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. అందుకు బదులుగా.. ఈడీకి న్యాయస్థానం ఒక నోటీసు జారీ చేసింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు గాను ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈడీకి కోర్టు సమయం ఇచ్చింది. దీంతో.. కేజ్రీవాల్ ప్రస్తుతానికి జైలులోనే ఉండాల్సి ఉంటుంది. కాగా.. విచారణ సమయంలో ఇరువర్గాలకు చెందిన న్యాయవాదుల మధ్య వాడీవేడీగా వాదనలు కొనసాగాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత సిట్టింగ్ సీఎంను అరెస్ట్ చేయడం సరికాదని కేజ్రీవాల్ తరపున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టుకు తెలిపారు. కేజ్రీవాల్‌ను వెంటనే ఈడీ కస్టడీ నుంచి రిలీజ్ చేయాలని కోరారు. కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీని నిర్వీర్యం చేసే ఉద్దేశంతోనే ఈడీ అరెస్ట్ జరిగినట్లు ఆయన కోర్టు ముందు ప్రస్తావించారు. పీఎంఎల్ఏ సెక్షన్ 50 ప్రకారం కేజ్రీవాల్ స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదని అన్నారు. కేజ్రీవాల్ ప్రాథమిక మానవ హక్కులను ఈడీ ఉల్లంఘించిందని, నేరాన్ని నిర్ధారించడంలో ఈడీ విఫలమైందని పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఈడీ అరెస్ట్ రాజకీయ పరమైందని ఆరోపించారు. అటు.. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తమ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్నాక.. ఢిల్లీ హైకోర్టు పైవిధంగా స్పందించింది.

# కమలదళాలు కదులుతున్నాయ్...

హైదరాబాద్, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంలో కమలనాథులు ప్రచారానికి పదును పెట్టారు. నాలుగు జాబితాల్లో 17 మంది అభ్యర్థులను ప్రకటించి ముందుస్తుగా ప్ర జలకు వెళ్లేందుకు బిజెపి అగ్ర నాయకత్వం ప్లాన్ చేస్తోంది. ఈసారి తెలంగాణలో 10 నుంచి 12 సీట్లు గెలుపే లక్షంగా ఎన్నికల పోరుకు కాళ్లు దువ్వుతున్నాయి. అందుకోసం అనుబంధ సంఘాలైన యువ మోర్చా, మహిళ, ఎస్సీ, ఎస్టీ ,ఏబీవీపీ సంఘాల నేతలను రంగంలోకి దించింది. యువ మోర్చా తొలిసారిగా ఓట్లు వేస్తున్న యువతను ఆకట్టుకునే విధంగా, కిసాన్‌మోర్చా రైతులతో, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ మోర్చాలు పేద, మధ్యతరగతి ప్రజలు తమ వైపు తిప్పుకునేందుకు ఆయా వర్గాలతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీకి అధిక ఓట్లు వచ్చేలా సిద్ధం చేస్తున్నారు.రెండు రోజుల కితం జరిగిన పదాదికారుల సమావేశంలో పోటీ చేసే అభ్యర్థులతో పాటు జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల బాధ్యులకు ప్రజలను ఆకట్టుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను దిశానిర్దేశం చేశారు. ప్రతి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించాలని, ప్రతి పోలింగ్ బూత్‌లో 370 ఓట్లు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని బట్టి నాలుగు భాగాలుగా విభజించి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నాలు చేయాలి. ఎంపీ అభ్యర్థి నేరుగా ప్రతి సమావేశానికి హాజరు కావాలని, అసెంబ్లీలో ఎన్నికల నిర్వహణ కమిటీల సమావేశాలు తరుచు నిర్వహించి, ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. ఇతర పార్టీలకు చెందిన ఆసమ్మతి నేతలతో పాటు స్థానిక కార్యకర్తలను చేర్చుకునే విధంగా ప్రత్యేకంగా ఒక టీం పనిచేయాలని సూచించారు. అదే విధంగా బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతను ప్రతి నాయకుడు తన పోలింగ్ బూత్‌లో కో ఆర్డినేటర్‌గా పనిచేయాలి. నామినేషన్ల దాఖలలోపు బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎన్నికల లోపు ప్రతి ఓటరును కనీసం మూడుసార్లు కలిసే విధంగా రూపొందించబడింది.

టికెట్లు రాని అసమ్మతినేలతో మంతనాలు

పార్టీ కోసం పనిచేస్తున్న కొంతమంది సీనియర్లు ఎంపీ టికెట్లు ఆశిస్తే పార్టీ వారికి కాకుండా ఇతర నాయకులకు ఇవ్వడంతో వారంతా సీనియర్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము పార్టీ నిర్మాణం కోసం శ్రమిస్తే తీరా సమయానికి ఇతర పార్టీ నుంచి వలస వచ్చి నేతలకు రాత్రి రాత్రికే టికెటు ఇవ్వడంపై మండిపడుతున్నారు. ప్రధానంగా నల్లగొండ స్థానం మాజీ ఎమ్మెల్యే సాయిదిరెడ్డి, పెద్దపల్లి సీటును గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్ టికెటు గొడుం నగేష్, నాగర్‌కర్నూల్ పొతుగంటి భరత్ ప్రసాద్, హైదరాబాద్ సీటు కొంపెల్లి మాధవీలత, వరంగల్ స్థానం ఆరూరి రమేష్, జహీరాబాద్ బిబిపాటిల్‌కు ఇవ్వడంపై తనకెంతా సీటు వస్తుందని ప్రచారం చేసుకున్నారు.ప్రచారం కోసం ముందుకు రావడం లేదు. పాత నాయకులకు ఓట్లు పడవని, కొత్త నాయకులను ప్రజలు ఆదరిస్తారని, తమతో పనిలేదని ఆవేదనతో మాట్లాడుతున్నారు. వీరంతా పార్టీకి దూరమైతే ఎంపీ అభ్యర్థులు గెలుపు కష్టమేనని, పాత నాయకులను సమన్వయం చేసుకుని పోవాలని అభ్యర్థులకు హస్తిన పెద్దలు సూచించారు. అందరం కలిసి ఏకతాటిపై పనిచేస్తే విజయం వరిస్తుందని, బేధాభిప్రాయాలు ఉంటే విపక్షాలు గెలుస్తామని, టికెట్లు ఆశించి భంగపడవారికి మూడోసారి అధికారం చేపట్టిన తరువాత నామినేటెడ్ పదవులు కట్టబెడుతామని హామీ ఇస్తున్నారు. ఇప్పటివరకు పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారికి సర్దుబాటు చేసే ప్రయత్నాలు అసమ్మతి నేతల అనుచరులు.

# విపక్ష నేతలే టార్గెట్.. కేరళ సీఎం కూతురిపై పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీ కేసు



హైదరాబాద్,లోక్‌సభ ఎన్నికలు సమీపించిన వేళ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులను తీవ్రతరం చేసింది. కేసులు.. నోటీసులు.. సోదాలతో ఆయా పార్టీల నేతలను ఒత్తిడికి గురిచేస్తున్నది. బుధవారం వివిధ రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకున్నది. ఆ పార్టీ ఢిల్లీ నేత దీపక్ సింగ్లా నివాసంలో సోదాలు జరిపింది. ఆప్ అధికారంలో ఉన్న మరో రాష్ట్రమైన పంజాబ్‌లోనూ తనిఖీలు చేపట్టింది. ఆ పార్టీ బలంగా ఉన్న గోవాలో పార్టీ కన్వీనర్‌కు నోటీసులు జారీ చేసింది. కేరళ సీఎం విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై కేసు నమోదు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ మహువా మొయిత్రాకు నోటీసులు జారీ చేసింది. ఉత్తరాఖండ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత హరక్ సింగ్ రావత్‌కూ నోటీసులు ఇచ్చింది. మరోవైపు, మద్యం పాలసీ కేసులో ఈడీ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించలేదు. అరెస్ట్ విషయంలో జోక్యం చేసుకునేందుకు కోర్టు నిరాకరించింది. మరోవైపు మద్యం విధానానికి సంబంధించిన నిజానిజాలను కేజ్రీవాల్ కోర్టులోనే వెల్లడిస్తారని ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్ చెప్పారు.కేరళ సీఎం విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై ఈడీ కేసు నమోదు చేసింది. వీణాకు చెందిన ఐటీ కంపెనీ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు కొచ్చిన్ మినరల్స్ అండ్ రీటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అక్రమంగా చెల్లింపులు చేసిందన్న ఆరోపణలతో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు.

అసలేమిటీ కేసు?

సీఎంఆర్ఎల్ అనే సంస్థ వీణాకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి 2018-19 మధ్య రూ.1.72 కోట్లు అక్రమ చెల్లింపులు చేసినట్టు ఐటీ శాఖ గుర్తించింది. ఎలాంటి సేవలను అందించకుండానే ఎక్సాలాజిక్‌కు సీఎంఆర్ఎల్ ఈ చెల్లింపులు చేసినట్టు ఐటీ శాఖ పేర్కొంది. దీంతో ఎక్సాలాజిక్‌పై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ) విచారణ జరిపి అక్రమంగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించింది. ఇది పరిగణనలోకి తీసుకొని ఈడీ కేసు నమోదు చేసింది.

మహువాకు ఈడీ నోటీసులు

తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం మరోసారి సమన్లు జారీ చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసులో భాగంగా గురువారం విచారణకు హాజరుకావాలంటూ నోటీసుల్లో పేర్కొంది. దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త దర్శన్ హీరానందానికి కూడా సమన్లు పంపింది.కాగా, ప్రశ్నలకు ముడుపుల కేసులో ఇంతకుముందు రెండు సార్లు మహువాకు ఈడీ సమన్లు జారీ చేసినా విచారణకు ఆమె హాజరుకాలేదు. ఇదే కేసులో గత శనివారం సీబీఐ మహువా నివాసాల్లో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. తాజాగా ఈడీ మూడోసారి ఆమెకు సమన్లు జారీ చేసింది. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణల కేసులో మహువాపై విచారణ చేపట్టాలని సీబీఐని లోక్‌పాల్ ఆదేశించింది.

గోవా ఆప్ చీఫ్‌కు ఈడీ సమన్లు

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గోవా ఆప్ కన్వీనర్ అమిత్ పాలేకర్, పలువురు పార్టీ నేతలకు ఈడీ సమన్లు జారీచేసింది. ఈ నెల 28(గురువారం) పనాజీలోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని అందులో కోరినట్టు అధికారిక వర్గాలు బుధవారం వెల్లడించాయి. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో అమిత్ పాలేకర్ ఆప్ సీఎం అభ్యర్థిగా ఉన్నారు. ఆయన ఇటీవల మాట్లాడుతూ గోవా ఎన్నికల ప్రచారం కోసం అక్రమ సొమ్ము పంపించారనే ఆరోపణలకు ఏ ఆధారాలు లేవని, ఎలాంటి దర్యాప్తుకైనా తమ పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

పంజాబ్‌లో అధికారుల ఇండ్లలో సోదాలు

ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తర్వాత ఈడీ ఇప్పుడు పంజాబ్‌పై దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. జామతోటల నష్టపరిహారానికి సంబంధించిన కేసులో బుధవారం ఈడీ అధికారులు చండీగఢ్, మొహాలీ, పాటియాలా, ఫిరోజ్‌పూర్, బతిండ ప్రాంతాల్లోని పలువురు అధికారులు, ప్రైవేటు వ్యక్తుల ఇండ్లలో సోదాలు నిర్వహించారు. పంజాబ్ ఎక్సైజ్ కమిషనర్ వరుణ్ రూజమ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. జామతోటల నష్టపరిహారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వరుణ్ రూజమ్ భార్య సిమ్రత్‌ప్రీత్ కౌర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఫిరోజ్‌పూర్ డిప్యూటీ కమిషనర్ రాజేశ్ ధిమమ్ ఇంట్లోనూ ఈడీ బృందాలు సోదాలు జరిపాయి. రాజేశ్ భార్య జాస్మీన్ కూడా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నిరసన ర్యాలీకి సన్నద్ధమవుతున్న వేళ

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఆప్ సన్నద్ధం అవుతున్న వేళ ఈడీ పంజాబ్‌లో రంగంలోకి దిగడం గమనార్హం.

దిలీప్ ఘోష్, సుప్రియా శ్రీనేత్‌కు ఈసీ నోటీసులు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కంగనా రనౌత్‌లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాథేలకు ఎన్నికల సంఘం బుధవారం వేర్వేరుగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారి వ్యాఖ్యలు అగౌరవంగా, దురుద్దేశంతో కూడుకుని ఉన్నాయని ఈసీ వ్యాఖ్యానించింది.

ప్రాథమిక ఆధారాలను బట్టి వీరిద్దరూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని స్పష్టమవుతున్నదని పేర్కొంది. తాము పంపిన షోకాజ్ నోటీసులకు ఈ నెల 29 సాయంత్రం లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు గౌరవంతో, హుందాగా వ్యవహరించాలని ఈసీ ఈ సందర్భంగా సూచించింది. ఎన్నికల సందర్భంగా ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రం కుమార్తెనని మమతా బెనర్జీ చెపుతున్నారని, ఇంతకీ ఆమె తండ్రి ఎవరో స్పష్టం చేయాలని దిలీప్ ఘోష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ మాజీ మంత్రి హరక్‌సింగ్‌కి ఈడీ నోటీసులు

ఉత్తరాఖండ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత హరక్ సింగ్ రావత్‌కు ఈడీ తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో ఏప్రిల్ 2న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఈడీ ఫిబ్రవరి 7న హరక్ సింగ్ ప్రాంగణాలపై దాడి చేసి 1.2 కోట్ల నగదు, బంగారం, ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకుంది. ఫిబ్రవరి 29న తమ ముందు హాజరు కావాలని నోటీసులు పంపినప్పటికీ, వేరే పని ఉన్నందున దానిని వాయిదా వేయాలంటూ ఆయన కోరారు. దీంతో ఈడీ తాజాగా మరోసారి నోటీసులు పంపింది.

# మళ్లీ తెరపైకి జిల్లాల పునర్వ్యవస్థీకరణ




హైదరాబాద్, రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు జ్యుడీషియల్ కమిషన్ వేయాలని భావిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. ఆంధ్రప్రదేశ్ తరహాలో పార్లమెంట్ నియోజకవర్గాలను ప్రాతిపదికగా తీసుకోవాలని భావిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం గతంలో జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తామని వ్యాఖ్యానించారు. ఈ లెక్కన ప్రస్తుతం 33గా ఉన్న జిల్లాల సంఖ్య దాదాపు తగ్గిపోతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. రెండు, మూడు అటూఇటుగా 20 వరకు జిల్లాలు ఏర్పాటు చేయొచ్చని చర్చ జరుగుతున్నది. అంటే కనీసం 13-15 జిల్లాల విలీనం తప్పదన్నమాట. దీంతో కొత్త జిల్లాలు కేంద్రంగా సవ్యంగా సాగుతున్న పాలన మళ్లీ దెబ్బతింటుందన్న ఆందోళన మొదలైంది. ఏ జిల్లా ఉంటుంది? ఏ జిల్లా పోతుంది? అని ప్రజల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు జిల్లాల సంఖ్యను కుదిస్తే అనేక కొత్త సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమయం, డబ్బు వృథా అవడంతోపాటు ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజలకు నష్టం కలుగుతుందని స్పష్టం చేస్తున్నారు.ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం ప్రతిపాదికన ఒక్కో జిల్లా చేస్తే.. 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నదని, మరి అప్పుడు కూడా మళ్లీ కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలు తగ్గిస్తే కలెక్టర్ పోస్టులు మొదలు అన్ని శాఖల జిల్లాస్థాయి హెచ్‌వోడీలు, ఆయా కార్యాలయాల్లో పనిచేసే అటెండర్ల వరకు అన్ని పోస్టులు రద్దు అవుతాయని చెప్తున్నారు. ఫలితంగా ఉన్నతాధికారుల సంఖ్య భారీగా పడిపోతుందని అంటున్నారు. ఇప్పుడు పదోన్నతులు వేగంగా వస్తున్నాయని, జిల్లాల సంఖ్య తగ్గితే ఆలస్యం అవుతాయని వెల్లడిస్తున్నారు. జిల్లాల ఏర్పాటుతో జోన్ల విభజన కూడా జరగాలని, ఇవన్నీ అధికారికంగా అమల్లోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి అనుమతి కావాల్సి ఉంటుందని, ఇది పూర్తి కావడానికి కనీసం ఒకటి, రెండేండ్లు పడుతుందని స్పష్టం చేస్తున్నారు. అప్పటివరకు ఎలాంటి నోటిఫికేషన్లు వేయడానికి ఆస్కారం ఉండదని, ఫలితంగా నిరుద్యోగులు నష్టపోతారని వివరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకేంద్రాల్లో నిర్మించిన భవనాలన్నీ వృథా అవుతాయని, జిల్లాల వారీగా పార్టీలు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అనుబంధ కమిటీలు ఇలా వందల మందికి పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాయి. వారంతా పదవులు కోల్పోయే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. మొత్తంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఆలోచనతో ప్రయోజనం దాదాపు శూన్యమని చర్చ జరుగుతున్నది.

# కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ




కరీంనగర్, తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలలో దాదాపు ఆయా పార్టీల సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ నుండి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ బరిలో దిగారు. బీజేపీ నుంచి ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు, సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ పోటీ చేస్తున్నారు. దాంతో వీరిని ఢీకొట్టేందుకు కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి ఎవరు దిగనున్నారు అన్న విషయం కరీంనగర్‌లో ఉత్కంఠ రేపుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ స్థానంలో కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థిపై ఎటు తేల్చుకోలేకపోతుంది. ఈ క్రమంలో ముగ్గురు పేర్లను అధిష్టానం పరిశీలిస్తోంది. కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతి రావు కుమారుడు రాజేందర్ రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పోటీ పడుతున్నారు. ఐతే బీఆర్ఎస్, బీజేపీ నుంచి బలమైన అభ్యర్థులు ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానం తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ పేరును తెరపైకి తెచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే ఎక్కువ ఉంటుంది. ఎంపీ టికెట్ వస్తే తీన్మార్ మల్లన్న ప్రచార ఖర్చులు భరించడానికి సిద్ధంగా ఉన్నారని పార్టీలో వినిపిస్తోంది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీకి ఈ తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. బీజేపీ అభ్యర్థి ఎంపీ బండి సంజయ్ కాపు సామాజికవర్గం కావడం అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో తీన్మార్ మల్లన్నను బరిలో నిలపాలని హస్తం పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థులుగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, వెలిచాల రాజేందర్ రావు పేర్లు ప్రచారంలో ఉండగా.. కొత్తగా మరొకరి పేరు పార్టీ శ్రేణుల్లో చక్కర్లు కొడుతుంది. క్యూ న్యూస్ జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేయడం దాదాపు ఖరారు అయినట్లు సమాచారం. తీన్మార్ మల్లన్న కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రచారం జోరందుకుంది. జర్నలిస్టుగా పలు సంస్థల్లో పనిచేసిన తీన్మార్ మల్లన్న గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోవడం తెలిసిందే. కాంగ్రెస్ నుంచి చివరగా పొన్నం ప్రభాకర్ 2009లో కరీంనగర్ ఎంపీగా గెలుపొందారు. అంతకుముందు కాంగ్రెస్ నేత 1984, 1989, 1991 లోక్ సభ ఎన్నికల్లో జువ్వాడి చొక్కారావు హ్యాట్రిక్ విజయాలు సాధించారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను పాతే దిశలో ప్రయత్నాలు జోరుగానే సాగుతున్నాయి. అయితే టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కుమార్, మరోవైపు బిజెపి నుంచి బండి సంజయ్ అభ్యర్థులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే వారి కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఢిల్లీకి వెళ్లడంతో.. మిగతా ఎంపీ అభ్యర్థులపై అధిష్టానంతో చర్చించనున్నారు. మరి తీన్మార్ మల్లన్నకి కాంగ్రెస్ నుండి కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుండి టికెట్ వస్తే పోటీ ఆసక్తికరంగా ఉంటుందని నేతలు చెబుతున్నారు.

# న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా మార్పులు అవసరం

హైదరాబాద్ : ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా మార్పులు రావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆకాంక్షించారు. రాజేంద్రనగర్‌లో తెలంగాణ నూతన హైకోర్టు భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ కాలంలో కోర్టులు సార్వభౌమత్వాన్ని కలిగి ఉండేవని, మారిన కాలంతోపాటు కోర్టుల్లోనూ మార్పులు వస్తున్నాయన్నారు. యువత వేగంగా మార్పులు కోరుకుంటోందన్నారు. కింది కోర్టుల్లోనే కాదు.. హైకోర్టుల్లోనూ మౌలిక సౌకర్యాల కొరత ఉంది. కొత్త హైకోర్టు కోసం చొరవ తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు సీజేను అభినందిస్తున్నా. నూతన భవనంలో స్త్రీలు, దివ్యాంగుల వంటి విభిన్న వర్గాలకు సౌకర్యాలుండాలి. న్యాయవ్యవస్థ విలువలు పెంపొందించేలా సీనియర్లు కృషి చేయాలి. సాంకేతిక యుగంలో కోర్టు కార్యకలాపాలకు ఇంటర్నెట్‌ను వాడుకోవాలి. ఇటీవల ఈ-కోర్టు పథకంలో



భాగంగా పలు చోట్ల ఈ సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయి"అని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నర్సింహా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# దుష్టచతుష్టాన్ని ఓడించేందుకు అర్జునుడు సిద్ధం

ప్రొద్దుటూరు : 58 నెలల తన పాలనలో ప్రతి రంగంలోనూ మార్పులు తీసుకొచ్చామని సీఎం జగన్ అన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.కడప జిల్లా ప్రజలను తనను బిడ్డలా చూసుకున్నారని తెలిపారు. పేద ప్రజలకు రూ. 2 లక్షల 70 వేల కోట్లు సంక్షేమ పథకాల రూపంలో పంచామని తెలిపారు. 2024 ఎన్నికలకు తామంతా సిద్ధంగా ఉన్నామని జగన్ పేర్కొన్నారు. పేదల భవిష్యత్తును మార్చేందుకు తాను ప్రయత్నం చేస్తుంటే దుష్టచతుష్టం అడ్డుపడుతోందని మండిపడ్డారు. దుష్టచతుష్టాన్ని ఓడించేందుకు అర్జునుడు సిద్ధంగా ఉన్నాడని జగన్ హెచ్చరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని సీఎం జగన్ పిలుపునిచ్చారు.అబద్ధాలు, మోసాలు, కుట్రలు చేసే వారే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులని జగన్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలను 45 ఏళ్లుగా చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని జగన్ విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే చంద్రబాబుకు మేనిఫెస్టో గుర్తుకువస్తుందని, ఆ తర్వాత అది చెత్త బుట్టకేపరిమితమవుతుందని సీఎం జగన్ ఎద్దేవా చేశారు. వైఎస్ వివేకానందారెడ్డిని హత్య చేసిందే ఎవరో అందరికి తెలుసున్నారు. హంతకుడికి తన ఇద్దరి చెల్లెమ్మలు మద్దతు ఇస్తున్నారని సీఎం జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రగ్స్ కంటైనర్ వ్యవహారంపై ..

ఇటీవల విశాఖలో కలకలం రేపిన డ్రగ్స్ కంటైనర్ వ్యవహారంపై తొలిసారిగా స్పందించారు . 'చంద్రబాబు వదిన గారి చుట్టం తన కంపెనీకి బ్రెజిల్ నుంచి డ్రైడ్ ఈస్ట్ పేరుతో డ్రగ్స్ ను పెద్దమొత్తంలో దిగుమతి చేస్తుంటే సీబీఐ వాళ్లు దాడి చేశారు. ఈ రెయిడ్ జరిగిందని తెలియగానే ఎల్లో బ్రదర్స్ అందరూ ఉలిక్కిపడ్డారు. దొరికింది వాళ్ల బ్రదరే అయినా, అతడు దొరికిపోయాడు కాబట్టి అతడిని మన (వైసీపీ) వాడు అని దుష్ప్రచారం చేస్తున్నారు. తీరా చూస్తే వారు ఎవరయ్యా అంటే%ోా% సాక్షాత్తు మన రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, చంద్రబాబు వదిన గారి కొడుకు, వియ్యంకుడు ఆ కంపెనీలో గతంలో డైరెక్టర్లు, భాగస్వాములు. బాబు అక్కడ నిలబెట్టిన ఎంపీ అభ్యర్థులకు ఇంకా బాగా దగ్గరి బంధుత్వం ఉంది .నేరమంటూ జరిగితే చేసింది వారు%ోా% కానీ తోసింది మన మీద. నేరం ఎక్కడైనా జరగనివ్వండి, ఎక్కడ ఏం జరిగినా మన మీద బురద చల్లడానికి ఒక చంద్రబాబు, ఒక దత్తపుత్రుడు వెంటనే రెడీ అయిపోతారు . వీళ్లందరూ ఓ ఎల్లో బ్యాచ్ గా తయారై నేరాన్ని మనకు ఆపాదిస్తారు. గత 45 ఏళ్లుగా చంద్రబాబు నడిపిస్తున్న క్షుద్ర రాజకీయాలను చూస్తూనే ఉన్నాం. దొరకని వాళ్లంతా టీడీపీ వాళ్లు దొరికితే మాత్రం వైసీపీ వాళ్లు అంటారు. బతికున్నప్పుడు



వివేకా గారిని శత్రువులా చూశారు. చనిపోయాక మాత్రం శవరాజకీయాలు, కుట్రలు చేస్తున్నారు. బతికున్న ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి చంపేస్తారు. చనిపోయాక వీళ్లే ఎన్టీఆర్ శవాన్ని లాక్కుని, విగ్రహాలు ఊరూరా పెట్టి, దండలు వేసి దణ్ణాలు పెడుతున్నారు. వీళ్ల నైతిక విలువలు ఎంత దయనీయంగా ఉన్నాయో చూడండి అని అన్నారు.మీ అందరి ప్రేమానురాగాల మధ్య నిల్చొని అడుగుతున్నా. ప్రజల మద్దతు లేని చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయం చేసినా.. నేను మాత్రం ప్రజల పక్షం ఉంటా అని గర్వంగా చెబుతున్నా.నాపై బురద జల్లుతూ రాజకీయం చేస్తున్నారు. అబద్ధాలు చెప్పేవారు, కుట్రలు చేసేవాళ్లు మనకు శత్రవులుగా ఉన్నారు. అందరూ కలిసి జగన్‌పై యుద్ధానికి వస్తున్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, బీజేపీ, కాంగ్రెస్ నా పై యుద్ధానికి కలిసి కట్టుగా వస్తున్నారు. ఇది చాలదన్నట్లు నా ఇద్దరు చెల్లెల్ని తీసుకొస్తున్నారు. వీళ్ల విలువలు లేని రాజకీయం ఎవరికి స్ఫూర్తి. నేను ఎప్పుడూ తప్పు చేయలేదు. నేను ధర్మాన్ని, న్యాయాన్ని నమ్ముకున్నా. నాకు ప్రజల అండగా, దేవుడి దయ ఉన్నాయి అని జగన్ పేర్కొన్నారు.

# నాడు శత్రువులు.. నేడు మిత్రులు



సాలూరు : రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది ఒక నానుడి. అది అక్షరాలా నిజమని తేలింది. ఒకసారి ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీ చేసిన నాయకులు తర్వాత ఎన్నికల్లో ఒకే పార్టీలో కలిసి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పుడదే జరుగబోతోంది. 2014 ఎన్నికల్లో అరకు ఎంపి అభ్యర్థులుగా వైసిపి నుంచి కొత్తపల్లి గీత, టిడిపి తరపున గుమ్మడి సంధ్యారాణి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గీత విజయం సాధించారు. తర్వాత కొత్తపల్లి గీత ఎస్‌టి కాదని సంధ్యారాణి కేసు వేశారు. వైసిపి ఎంపిగా విజయం సాధించిన తర్వాత కొన్నాళ్లకు గీత అధికారంలోకి వచ్చిన టిడిపికి అనుకూలంగా పని చేయడం ప్రారంభించారు. ఆ పరిస్థితుల్లో గీతపై వేసిన కేసుని సంధ్యారాణి ఉపసంహరించుకున్నారు. పదేళ్ల తర్వాత మళ్లీ ఇద్దరూ కలిసి పని చేయాల్సిన సందర్భం వచ్చింది. అప్పుడు ప్రత్యర్థులుగా పోటీ పడిన గీత, సంధ్యారాణి ఇప్పుడు మిత్రులుగా కలిసి పని చేయాల్సిన అవసరం ఏర్పడింది. టిడిపి, జనసేన, బిజెపితో పొత్తులో భాగంగా నియోజకవర్గంలో బిజెపి ఎంపి అభ్యర్థి కొత్తపల్లి గీత గెలుపు కోసం టిడిపి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి పని చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల బిజెపి అరకు ఎంపి అభ్యర్థిగా కొత్తపల్లి గీతని ఖరారు చేసింది. మరోవైపు పదేళ్ల నాటి శత్రుత్వం ఇప్పుడు కూడా వారిద్దరి మధ్య ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. గీతపై కుల వివాదం వెంటాడుతున్నా బిజెపి ఆమె పేరునే ప్రకటించింది. గీతని ఎంపి అభ్యర్థి చేయొద్దని టిడిపి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో గీత విజయం కోసం సంధ్యారాణి ఏ మేరకు కృషి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

## డెబిట్ కార్డులపై ఎస్‌బిఐ వాయింపు

ముంబయి,దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు ఎస్‌బీఐ తమ డెబిట్‌కార్డు నిర్వహణ ఛార్జీలను సవరించింది. గరిష్ఠంగా రూ.75 వరకు పెంచింది. కొత్త ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఎస్‌బీఐ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం ప్రస్తుతం క్లాసిక్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులపై బ్యాంకు రూ.125 వసూలు చేస్తోంది. ఏప్రిల్ నుంచి దీన్ని రూ.200 చేసింది. యువ, గోల్డ్, కాంబో కార్డులపై ఇప్పుడు రూ.175 ఛార్జీ ఉండగా.. దాన్ని కొత్త ఆర్థిక

## విహెచ్‌కు సిఎం రేవంత్ బుజ్జగింపు

హైదరాబాద్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావును సీఎం రేవంత్‌రెడ్డి కలుసుకుని బుజ్జగించారు. విహెచ్‌కు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇటీవల ఆయన ఖమ్మం లోక్‌సభ టికెట్‌ను ఆశించారు. టిక్కెట్ తనకు దక్కే అవకాశం లేదని సమాచారం అందడంతో అలక బూనారు. గత కొన్నిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన.. ఇటీవల మీడియా ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com